

వేదికపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి



సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఏఎంజీ ఎంవోయూ

# మరో ముందడుగు

- సర్కారుతో ఏఎంజీ మెటల్ ఒప్పందం
- రూ.44 వేల కోట్లతో పరిశ్రమ
- యు.కొత్తపల్లిలో ఏర్పాటు

**ఈ పరిశ్రమలో ఏం చేస్తారంటే..**

ఈ సంస్థ బాక్సైట్ ఖనిజం నుంచి తీసిన అల్యుమినాను ముడిపదార్థంగా ఉపయోగించి అల్యూమినియంను ఇంగోట్స్ రూపంలో తయారు చేస్తుంది. వీటిని కరిగించి ఐరన్ బిల్లెట్స్, వైర్ రాడ్‌లు, అల్యూమినియం షీట్లు, కాయిల్స్ వంటివి తయారు చేస్తారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విశాఖ పెట్టుబడుల సదస్సులో కాకినాడకు భారీ పెట్టుబడి వచ్చింది. రూ.44వేల కోట్లతో ఏఎం గ్రీన్ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ సమక్షంలో ఏఎం గ్రీన్ ఒప్పందంపై సంతకం చేసింది. పిఠాపురం నియోజకవర్గంలోని యు.కొత్తపల్లి మండలంలో ఈ కంపెనీ ఏర్పాటుకానుంది. కంపెనీ స్థాపనలో భాగంగా భూమి, భూ అభివృద్ధికి రెండు దశల్లో రూ.1800 కోట్లు, భవనాలు, ఇతర సివిల్ పనులకు రెండు దశల్లో రూ.2,950కోట్లు, ప్లాంట్, ఇతర యంత్రాలకు రెండు దశల్లో రూ.30,300కోట్లు, ఇంకా ఇతర ఖర్చులు కలిపి మొత్తం తొలిదశ కింద రూ.24,250 కోట్లు, రెండోదశ కింద రూ.19,750కోట్లు కలిపి మొత్తం రూ.44వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు ఎంఓయూలో కంపెనీ పేర్కొంది. తొలి దశలో 0.5 మిలియన్ టన్నులు, రెండోదశలో 0.5మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయనుంది. తద్వారా మొత్తం 3 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఇప్పటికే ఈ సంస్థ రాష్ట్రంలో రూ.50 వేల కోట్లతో పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టింది. కాగా ఈ సంస్థకు ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామిక ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు 250 ఎకరాల భూకేటాయింపునకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉత్పత్తికి సహకరించడంలో భాగంగా గ్రీన్‌కారిడార్ విధానంలో 2,500మెగావాట్ల విద్యుత్, నీటి అవసరాలు తీర్చేలా 17.2 ఎంఎల్‌డీ నీటి సరఫరా, భారీ పరిశ్రమ కేటగిరీలోకి చేర్చి అన్ని ప్రభుత్వశాఖల నుంచి అవసరమైన అన్నిరకాల అనుమతులు వేగంగా జారీచేయనుంది. ఇదే సంస్థ కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.13వేల కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చింది.


# గోవింద హారతి!





గోదావరి మాతకు హారతిస్తున్న ఆనంద తీర్థాచార్యులు, ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

టీటీడీ ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు శుక్రవారం రాత్రి మహా మంగళ హారతి అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చారు.. ఏడుకొండలవాడు.. భక్తజనం చెంతకు వస్తున్నాడంటే ఊరుకుంటారా.. ఆ స్వామిని చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు.. ఎటుచూసినా భక్తజనమే.. కొవ్వూరు గోదావరి తీరమంతా భక్తజన సంద్రమైంది.. ఆ స్వామిని కన్నులారా చూసి.. మనసారా వేడుకున్నారు.. విశిష్ట పూజలు చేశారు. గోవిందా.. గోవింద నామస్మరణలతో గోష్పాద క్షేత్రం మార్మోగింది.. గోదావరికి గోవిందుడి హారతిచ్చారు. - 7లో



# ఎన్నికలొస్తున్నాయ్!

## స్థానికం..సమాయత్తం

స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. గడువుకు ముందే ముందస్తు ఎన్నికల మోత మోగబోతోంది. పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికల రణభేరికి సర్వం సిద్ధమవుతోంది. తాజాగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ఎన్నికల సంఘం కార్యాచరణ రూపొందిస్తోంది. మరో పక్క స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ కేడర్‌ను సైతం టీడీపీ సిద్ధం చేస్తోంది. దీంతో కొద్దిరోజుల్లో స్థానిక సంస్థల వేడి రాజుకోనుంది. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- ముందస్తు సన్నాహాలు
- ఓటర్ల జాబితాకు కసరత్తు
- పార్టీ శ్రేణులకు టీడీపీ పిలుపు
- అధికారులకు ఎస్ఈసీ లేఖలు
- 2026 జనవరిలోగా నోటిఫికేషన్
- అదే నెలలో ఫలితాలు!

అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏడాదిన్నరకు స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఉమ్మడి జిల్లాలో మొదలు కాబోతోంది. వాస్తవానికి వచ్చే ఏడాది మార్చి నాటికి మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు, సర్పంచ్‌లకు ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతోంది. మార్చి తర్వాత ప్రభుత్వం తనకు నచ్చినపుడు ఎన్నికలు జరపొచ్చు. కానీ ప్రభుత్వం మాత్రం ముందస్తుకే మొగ్గు చూపుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏడాదిన్నర లోపే కూటమి సర్కారు అమలు చేసి జోష్ మీద ఉంది.ఈ సమయంలోనే ముందస్తు ఎన్నికలకు వెళ్లి విజయభేరి మోగించా లని భావిస్తోంది. ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేస్తోంది.పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళ వారం అమరావతిలో పార్టీ జోనల్ కో ఆర్డినేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు.పార్టీ నేతలు,క్యాడర్‌ను సమాయత్తం చేయాలని సూచించారు. ఎన్నికలకు సమాయత్తమయ్యే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే పార్టీ పదవులు చాలావరకు భర్తీ చేశారు. అటు నామినేటెడ్ పదవుల పంపకం పూర్తి చేశారు.

### జనవరిలో ఎన్నికలు..?

స్థానిక సంస్థల గడువు ముగియడానికి మూడు నెలల ముందే వీటికి ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది. మునిసిపాలిటీలు, పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కసరత్తు ప్రారంభించాలని ఆదేశిస్తూ పురపాలక, పంచాయతీరాజ్ శాఖలకు సెప్టెంబరులో లేఖ రాసింది. తాజాగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలకమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ నెల 6న అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణకు వీలుగా సిబ్బందికి శిక్షణ ప్రారంభించబోతున్నారు. ఈ నెలాఖరులోగా ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. డిసెంబరులో వార్డుల వారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, ఎన్నికల అధికారుల నియామకం, పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలను సిద్ధం చేయడం, రిజర్వేషన్ల ఖరారు తదితర ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు సమాచారం.జనవరి నెలాఖరులో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల వెల్లడికి వీలుగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

### 2021లో ఎన్నికలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 1,073 పంచాయతీల్లో నాలుగు దశల్లో 11,782 వార్డులకు 12,048 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు.31 పంచాయతీలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. కాకినాడ,పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 366 పంచాయతీలకు తొలివిడత, రెండోవిడత రాజమహేంద్రవరం,రామచంద్రపురం డివిజన్ల పరిధిలో 247 పంచాయతీలకు, మూడో విడత రంపచోడవరం,ఎటపాక డివిజన్ల పరిధిలో 186 పంచాయతీలకు, నాలుగో విడత కోనసీమలో 274 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో మొత్తం ఓటర్లు 7,68,483గా తేలారు.వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వార్డులు,ఓటర్లు పెరగనున్నాయి.

### పెరగనున్న వార్డులు..

ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయి. కాకినాడ, రాజమ హేంద్రవరంలో రెండు కార్పొరేషన్లు ఉన్నాయి. వీటన్నింటిలో వార్డుల విభజన నేపథ్యంలో వీటి సంఖ్య పెరగనుంది. కాకినాడ కార్పొరేషన్‌కు 2022 సెప్టెంబరుకు ఐదేళ్ల పదవీ కాలం పూర్తయినా మళ్లీ ఇప్పటివరకు ఎన్నికలు జరగ లేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ప్రస్తుతం ఉన్న 50 వార్డులకు అదనంగా మరో పది వార్డుల వరకు పెరిగే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో శివారు గ్రామాల విలీనం సమస్య పరిష్కారమై పెరిగే వార్డులతో కలిపి ఇక్కడా ఎన్నికలు జరగనున్నాయి.

### కొత్త వాళ్లకు చోటు..

2021 మార్చిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏడు మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 268 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు చేరడంతో వీటి సంఖ్య తొమ్మిదికి చేరనుంది.అప్పట్లో చేతిలో అధికారం ఉండడంతో వైసీపీ అడ్డగోలుగా 35 వార్డుల్లో బలవం తపు ఏకగ్రీవాలు చేయించింది.దీంతో 233 వార్డులకే ఎన్నికలు జరిగాయి.వార్డుల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో మునిసిపాలిటీ, నగర పంచాయతీల్లో వార్డుల సంఖ్య మరింత పెరగనుంది. గత మునిసిపల్ ఎన్నికల్లో మొత్తం 655 మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరింత మంది పోటీ చేసే అవకాశం దక్కనుంది.



దేవరపల్లిలో పొగాకు నారుమడులు పరిశీలిస్తున్న పొగాకుబోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

# ఆశాజనకంగా పొగాకు ధరలు

## దేవరపల్లి పొగాకు బోర్డు సందర్శనలో చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్.యశ్వంత్ కుమార్ అన్నారు. దేవరపల్లిలో శుక్రవారం పొగాకు బోర్డును సందర్శించి మాట్లాడారు. గత రెండేళ్లగా పోల్చితే ఈ ఏడాది చివరిలో సంతృప్తికరంగా లేదన్నారు. గ్రేడ్ వన్ పొగాకు ధర ఆశాజనకంగా ఉన్నా మాడుకు ధర అంత ఆశాజనకంగా లేదన్నారు. పొగాకు పరిమితి మేరకే పండించాలని రైతులకు సూచించారు. ఎన్ఎల్ఎస్ ఏరియాలో 83.62 మిలియన్ కిలోలు పొగాకు ఉత్పత్తి అయ్యిందన్నారు. జం గారెడ్డిగూడెం, కొయ్యలగూడెం కేంద్రాల్లో ఈ నెలాఖరు వరకు పొగాకు కొనుగోళ్లు జరుగుతాయన్నారు.ఈ ఏడాది ఏపీలో 16 వేల కేంద్రాల్లో 167 మిలియన్ కిలోలు పొగాకు ఉత్పత్తి అంచనా వేయగా 240 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయ్యిందని తెలిపారు.కర్ణాటకలో ఇప్పటి వరకు 14 మిలియన్ కిలోల పొగాకు అమ్మకం జరిగిందన్నారు.అనంతరం దేవరపల్లి, పల్లంట్ల సంగాయిగూడెంలోని పొగాకు నారుమడులు పరిశీలించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్, దేవరపల్లి పొగాకు బోర్డు ఏఎస్ హేమస్మిత, రైతులు కరుటూరి శ్రీనివాస్, కాట్రు సత్యనారాయణ, నరహరశెట్టి రాజేంద్రబాబు, దుద్దుపూడి హరిబాబు పాల్గొన్నారు.

# జిల్లాలో సదరం శిబిరాలు ప్రారంభం

- ఈ నెల 14 నుంచి స్లాట్‌లు
- డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ



కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా కొత్త సదరం సర్టిఫికెట్లు జారీ కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించేందుకు నవంబరు 14వ తేదీ నుంచి స్లాట్ విడుదల చేసినట్టు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారిని (డీసీహెచ్ఎస్) డా. ఎం.పద్మ తెలిపారు. ప్రతి సోమవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, ప్రతి మంగళవారం ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, జీజీహెచ్‌లలో సదరం సర్టిఫికెట్లకు అవసరమైన అసెస్‌మెంట్లు, స్ర్కీనింగ్‌లు నిర్వహించబడతాయన్నారు.డీఎస్‌హెచ్ అండ్ డీఎంఈ ఆసుపత్రుల్లో రెగ్యులర్ స్లాట్‌ల కేటాయింపు జరుగుతుందన్నారు.సదరం శిబిరాల్లో రోస్టర్ ప్రకారం సాంకేతిక సిబ్బంది విధులు నిర్వహించడం జరుగతుందన్నారు. దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీసీహెచ్ఎస్ డా.పద్మ తెలిపారు.



బస్‌ను ప్రారంభిస్తున్న వైఎస్ఎన్ మూర్తి

# శబరిమలకు ఆర్టీసీ బస్‌లు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి శబరిమల అయ్యప్పభక్తుల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం తొర్రేడు నుంచి శబరిమల యాత్రకు బయలుదేరిన బస్సును ప్రారంభించి మాట్లాడారు. అయ్యప్పభక్తుల కోసం శబరిమలకు ప్రత్యేకంగా ఆడియో, వీడియో, పుష్‌బ్యాక్ సౌకర్యం కల్గిన కొత్త బస్సులు నడుపుతున్నామన్నారు. ఇప్పటికే 8 బస్సులకు టిక్కెట్లు బుక్ అయ్యాయన్నారు. రూటు అవగాహన కల్గిన ఇద్దరు డ్రైవర్లు ఉంటారని, 36 సీటింగ్ సామర్థ్యం ఉంటుందని తెలిపారు. బస్సు మొత్తం బుక్ చేసుకుంటే ఇద్దరు గురుస్వాములకు, ఇద్దరు వంటవారికి, ఇద్దరు మణికంఠలకు ఉచితంగా అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 15వ తేదీన దొడ్డిగుంట నుంచి ఒకటి, 17న జంబూపట్నం నుంచి మూడు, పిడింగొయ్యి నుంచి ఒక బస్సు బయలుదేరి వెళుతున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్ మాట్లాడుతూ 30 కంటే ఎక్కువ మంది మంది భక్తులు ఉంటే వారు కోరినచోటు నుంచే బస్సు నడుపుతామన్నారు.కార్యక్రమంలో ఎం.అజయ్‌బాబు, బి.శివకుమార్ పాల్గొన్నారు.



నిడదవోలు మునిసిపాలిటీ

# నిడదవోలు పురపాలనకు..
# వజ్రోత్సవం

- 1964లో మునిసిపాలిటీగా మార్పు
- 60 ఏళ్లుగా సేవలు అందజేత
- రేపటి నుంచి ఉత్సవాలు
- 5కే రన్, వాక్‌తో ఆరంభం

నిడదవోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే ఎంతో చారిత్రాత్మకమైన పురపాలక సంఘంగా నిడదవోలు.. 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని నిడదవోలు పురపాలక సంఘం వజ్రోత్సవం 2025 పేరుతో వేడులకు సిద్ధమవుతుంది. నిడదవోలు నగర పంచాయితీ నుంచి 1964 డిసెంబరు 1వ తేదీన ప్రత్యేక అధికారి పాలనతో నిడదవోలు పురపాలక సంఘ పాలన ప్రారంభమైంది. గత 60 ఏళ్లుగా అభివృద్ధి చెందుతున్న ఈ పురపాలక సంఘానికి 8 మంది ప్రత్యేకాధికారులు, 12 మంది చైర్మన్లు ప్రాతినిధ్యం వహించారు. తొలి చైర్మన్‌గా డాక్టర్ బీవీఎల్ఎన్.రాజు (భూపతిరాజు వెంకట లక్ష్మీ నరసింహరాజు) 1967 అక్టోబరు 20వ తేదీ నుంచి 1970 ఫిబ్రవరి 8వ తేదీ వరకు బాధ్యతలు నిర్వహించగా ప్రస్తుతం 12వ చైర్మన్‌గా 2021 మార్చి 18వ తేదీ నుంచి భూపతి ఆదినారాయణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నిడదవోలులో ఈ నెల 16వ తేది ఆదివారం ఉదయం 6 గంటలకు 5కె రన్,వాక్ తో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ నెలాఖరు వరకు నిడదవోలులో పెద్ద ఎత్తున డైమండ్ జూబ్లీ ఉత్సవాలకు నిడదవోలు పురపాలక సంఘం సంసిద్ధం అవుతోంది. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

### అభివృద్ధి చేస్తా..



నిడదవోలును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం. డైమండ్ జూబ్లీ ఉత్సవాల స్ఫూర్తితో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం.
- దుర్గేష్, మంత్రి

### చైర్మన్..అదృష్టం



నిడదవోలు పురపాలక సంఘ చైర్మన్ కావడం నా పూర్వజన్మ సుకృతం. నా హయాంలో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది.
- ఆదినారాయణ, చైర్మన్

# 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

## జేసీ మేఘాస్వరూప్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి జిల్లాలో వరి సేకరణ 4 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించినట్టు జేసీ వై . మేఘా స్వరూప్ శుక్రవారం తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో శుక్రవారం వరకు(14వ తేదీ నాటికి) 5,890 ధాన్యం కూపన్లు జనరేట్ చేయగా 16 మండలాల్లో ఏర్పాటు చేసిన 122 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3,695 మంది రైతుల నుంచి 27,616.360 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. 48 గంటల్లోపు 3,191 మంది రైతుల ఖాతాకు రూ.56.84 కోట్లు జమ చేశామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం తేమ స్థాయికి ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. గోనెసంచులు ఆర్ఎస్‌కెల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీకి రూ.2,389, గ్రేడ్ ఏ వెరైటీకి రూ.2.369 చొప్పున చెల్లింపులు జరుగుతాయన్నారు. గోనెసంచులు వినియోగానికి ఒక్కింటికి రూ.4.74, హమాలీకి ప్రతి క్వింటాకు రూ.22 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు, సందేహాల నివృత్తికి కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



7

# ఆపరేషన్..గోదారి!






## పేపర్లు కాదు...

సబ్జెక్టుల వారీగా ఇచ్చిన ఎసెస్‌మెంట్ బుక్‌లెట్లు

# పుస్తకాలపైనే

- ఆకర్షణీయంగా.. ఆకట్టుకునేలా ఎసెస్‌మెంట్ బుక్‌లెట్ల రూపకల్పన
- సబ్జెక్టుల వారీగా అన్ని పరీక్షలకు ఒకే బుక్‌లెట్
- విడి పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి స్వస్తి
- అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షల నిర్వహణ

**ఇప్పటి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షలు రాసేది పేపర్లపై. వాటిని ఏ పరీక్షకు ఆ పరీక్షకు ఇచ్చి వాటిని మూల్యాంకనం చేసి పక్కన పెట్టేవారు. ఇప్పుడు అలా కాదు ఆ విధానాన్ని పూర్తిగా మార్చివేశారు. సబ్జెక్టుల వారీగా అన్ని పరీక్షలకు కలిపి వేర్వేరు బుక్‌లెట్లను విద్యార్థులకు అందించి పరీక్షలు రాయిస్తున్నారు. దీనితో ప్రతి విద్యార్థి ప్రగతిని ఇట్టే ఉపాధ్యాయులు అవగాహన చేసుకునే వీలు ఏర్పడుతుంది. అదేవిధంగా పరీక్షల మార్కులను ఆన్‌లైన్ చేయనున్నారు.**

(పిఠాపురం/గొల్లప్రోలు- ఆంధ్రజ్యోతి)

చిన్ననాటి నుంచి ప్రభుత్వ, మండల, మునిసిపల్, జిల్లాపరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పరీక్షలను విద్యార్థులు అప్పటికప్పుడు ఇచ్చే తెల్లకాగితాలపైనే రాసేవారు. ఈ విధానమే పీజీ వరకూ అమలులో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగంలో వస్తున్న సంస్కరణల్లో భాగంగా ఇప్పటికే పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్పు చేశారు. సెమిస్టర్ విధానాన్నీ అమలు చేస్తున్నారు. బోధనలోనూ కొత్త విధానాలు తీసుకువచ్చారు. సాధారణంగా ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకూ ప్రతి విద్యాసంవత్సరంలో ఫార్మటివ్ అసెస్‌మెంట్ (యూనిట్) పరీక్షలు నాలుగు జరుగుతాయి. క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ఫైనల్ ఎగ్జామ్స్ స్థానంలో సమ్మెటివ్ అసెస్‌మెంట్ 1,2 పరీక్షలను నిర్వహిస్తున్నారు. కొత్త విధానంలో మొదటి, రెండవ సెమిస్టర్లల్లో రెండు ఫార్మటివ్, ఒక సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు వంతున జరుగుతాయి. ఇప్పటికే రెండు ఫార్మటివ్ పరీక్షలు ముగియగా, ప్రస్తుతం సమ్మెటివ్ ఎసెస్‌మెంట్-1 పరీక్షలు జరుగుతున్నాయి.

### అందంగా తీర్చిదిద్దారు

పరీక్షలు రాసే విధానంలో సమూల మార్పులు తీసుకువచ్చారు. విద్యార్థులపై ఒత్తిడి లేని రీతిలో పరీక్షలు పేపర్లపై కాకుండా అందంగా, ఆకర్షణీయంగా ఉన్న పుస్తకాలపై రాసేలా నిర్ణయించిన ప్రభుత్వం, నిపుణుల సలహాలతో అసెస్‌మెంట్ బుక్‌లెట్లను రూపొందించారు. 1నుంచి 10వ తరగతి చదివే ప్రతి విద్యార్థికి వారు చదువుతున్న తరగతులకు అనుగుణంగా ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ తయారుచేశారు. విద్యార్థులు అన్ని ఫార్మటివ్, ఎసెస్‌మెంట్ పరీక్షలను ఇందులోనే రాయాల్సి ఉంటుంది. వీటిని ఎప్పటికప్పుడు సంబంధిత క్లాస్ టీచర్ లేదా సబ్జక్టు టీచర్ మూల్యాంకనం చేసి అదే బుక్‌లో మార్కులు నమోదు చేస్తారు. కాకినాడ జిల్లాలోని అన్ని పాఠశాలలతోపాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో గల అన్ని ప్రభుత్వ, మునిసిపల్, మండల పరిషత్, కార్పొరేషన్, జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సరిపడా బుక్‌లెట్లను అందజేశారు. ఇప్పటికే విద్యార్థులు రెండు ఎఫ్ఏ పరీక్షలను ఈ బుక్‌లెట్లల్లో రాయగా, ప్రస్తుతం జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను ఇందులోనే రాస్తున్నారు. ఆకట్టుకునే రీతిలో ఉన్న ఈ బుక్‌లెట్లపై పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాయగలుగుతారని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

### ఎప్పటికప్పుడు విద్యార్థి ప్రగతిపై..

ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ ఇచ్చి దానిపైనే ఆ విద్యా సంవత్సరంలో పరీక్షలు అన్ని రాసే విధానం అమలులోకి తేవడంతో విద్యార్థుల ప్రగతిపై ఎప్పటికప్పుడు పరిశీలన చేసే అవకాశం ఉపాధ్యాయులు లభిస్తోంది. అదే విధంగా ఈ బుక్‌లెట్‌ను విద్యార్థి అపార్ లేదా పెన్ ఐడీకి అనుసంధానం చేస్తున్నారు. ఈ అసెస్‌మెంట్ పరీక్షల మార్కులతోపాటు విద్యా సంవత్సరం చివరిలో ఇంటర్నల్ మార్కులు కూడా కలుపుతారు. ప్రతి పరీక్షకు మార్కులతోపాటు గ్రేడ్‌ను కూడా ఇస్తారు. విద్యాసంవత్సరం పూర్తైన తర్వాత సర్టిఫికెట్ ఆఫ్ అసెస్‌మెంట్ కంప్లీషన్‌ను విద్యార్థికి అందజేస్తారు. ఇలా ప్రతి సబ్జెక్టుకు సర్టిఫికెట్లు ఇవ్వడం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. బుక్‌లెట్లపై పరీక్షలు రాయడం ఆనందంగా ఉందని, ఇది తమ ప్రగతికి దిక్సూచిగా నిలుస్తుందని విద్యార్థులు చెప్పారు.





అంబాజీపేటలో ఏర్పాటు చేసిన వెచ్చని దుస్తులు.. జి.అగ్రహారంలో చలిమంట వేసుకున్న యువకులు

## చలి పంజా

పెరిగిన చలిగాలులు

చలి తట్టుకొనేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

పల్లెల్లో వెలుస్తున్న ఉన్ని దుస్తుల దుకాణాలు

అంబాజీపేట,నవంబరు14(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో శీతల గాలులు భారీగా వీస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి చలిగాలుల తీవ్రత పెరిగింది. రోజురోజుకి చలి తీవ్రత అధికమవ్వడంతో ప్రజలు చలికి విలవిలాడుతున్నారు. చలిగాలులు ముందు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క చలి నుంచి రక్షించుకొనేందుకు ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో రగ్గులు, స్వెట్టర్లు అమ్మే ప్రత్యేక దుకాణాలు కూడా వెలుస్తున్నాయి. చలికాలం ప్రారంభమై నెలరోజులు కావడంతో చలిగాలులు క్రమేపీ పెరుగుతున్నాయి. ఉదయం ఏడు గంటల వరకూ చలి తీవ్రత అలాగే ఉండడంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పరిస్థితి ఇలా ఉంటే సాయంత్రం పరిస్థితి మరోలా ఉంది. ఆరు గంటల నుంచే వాతావరణం ఒక్కసారిగి మారిపోయి చలి తీవ్రత ప్రారంభమవుతోంది. అప్పటినుంచి ప్రారంభమైన చలిగాలులు రాత్రంతా కొనసాగుతున్నాయి. పల్లెల్లో సుమారు 22 నుండి 25 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు తగ్గాయి. కనిష్ఠ దీంతో కనీసం బయటకు రాలేక గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీ పనులకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మాలలు ధరించిన అయ్యప్ప, భవాని, శివమాలధారులు చలికి మరింత ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెచ్చదనం కోసం చలి మంటలను వేసుకుంటున్నారు. ఇప్పటికే ప్రజలు శీతాకాల ప్రభావంతో జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. చలి ఇలాగే కొనసాగితే మరిన్ని రుగ్మతలకు లోనయ్యే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో వెచ్చని ఉన్ని వస్త్రాలకు గిరాకీ పెరిగింది. ఈ సీజన్‌లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, నేపాల్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం మామూలే. ఈ ఏడాదీ ఈ వెచ్చని నేస్తాలను విక్రయించేందుకు పట్టణాలకు వచ్చారు. ప్రస్తుతం చలి పెరుగుతుడడంతో దుస్తుల అమ్మకాల సాగించేందుకు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి గ్రామాలకు వచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. గతంలో అల్లికల స్వెట్టర్లను వినియోగించేవారు. ఇప్పుడు ఎక్కువగా యంత్రాలపై తయారుచేసిన ఉన్ని దుస్తులు ఆకర్షణీయంగా ఉండడంతో వాటిపైనే ఆసక్తి చూపుతున్నారు. చలితోపాటు వర్షం నుంచి రక్షణగా ఉపయోపడేలా తయారుచేసిన ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. చెవులకు కప్పే మంకీ క్యాప్‌లు, చేతులకు గ్లౌజులు, చిన్నారులను ఆకర్షించే టెడ్డీ బేర్ తరహా దుస్తులు, రగ్గులు, సోలాపూర్, దుప్పట్లు వివిధ ఆకర్షణీయమైన రంగు, బొమ్మలతో ముద్రించిన ఉన్ని దుస్తుల కొనుగోలుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఉన్ని వస్తువులు రకాలను బట్టి రూ.100 నుంచి రూ.2వేల వరకు వాటి ధరలున్నాయి.

## 83 రోజులపాటు శుక్రమౌఢ్యం

వివాహాది శుభ కార్యక్రమాలకు

ముహూర్తాలు నిల్

బంగారం దిగివచ్చేనా..?

అమలాపురంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): బంగారం ప్రస్తావన లేకుండా ఏ శుభ కార్యక్రమం పూర్తికాని రోజులివి. ఇక వివాహ సమయాల్లో అయితే బంగారు ఆభరణాలకు ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. బంగారు ఆభరణాలతో హుందాతనాన్ని ప్రదర్శించే రోజులివి. ఎన్నడూ లేనివిధంగా బంగారం ధరలు ఆకాశంలో చుక్కలనే దాటిపోయిందని చమత్కరిస్తున్నారంతా. రెండేళ్ల వ్యవధిలో రెట్టింపు అయిన బంగారం ధరలు తగ్గే అవకాశం ఉందా అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. ఈ ఏడాది వివాహాది శుభ ముహూర్తాలకు ఇక రెండు రోజులే మిగిలి ఉంది. ఆ తరువాత 83 రోజులపాటు శుక్రమౌఢ్యం కావడంతో వివాహాది శుభ కార్యక్రమాలకు ముహూర్తాలు ఉండవు. దాంతో ఆ సమయంలోనైనా బంగారం ధరలు దిగి వస్తాయన్న ఆశాభావంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెరుగుట విరుగుట కొరకే అన్న సామెత బంగారానికి వర్తిస్తుందో లేదో వేచి చూడాల్సిందే. శుక్రమౌఢ్యం కారణంగా వివాహ, గృహప్రవేశ, శంకుస్థానల వంటి శుభ కార్యక్రమాలకు సుమారు మూడు నెలలపాటు బ్రేక్ పడిన నేపథ్యంలో బంగారం ధరలు తగ్గవచ్చునని వ్యాపారులు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే నెల నుంచి బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో వ్యాపారం అంతంతమాత్రంగానే ఉంటుందని చిరు బంగారు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికితోడు బడా వ్యాపార సంస్థలు బంగారం కొనుగోళ్లపై సైతం ఆఫర్లు ప్రకటించి చిరు వ్యాపారులకు కొద్దిపాటి వ్యాపారం కూడా లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది బంగారం ధరలు చుక్కలనంటాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.35లక్షలకు పెరిగింది. 22 క్యారట్ల బంగారం ధర రూ.1.21లక్షలకు పెరిగింది. ప్రస్తుతం బంగారం ధరల్లో ఎగుడుదిగుడులు కొనసాగుతూ కాస్తంత తగ్గి ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.27 లక్షల వద్ద ఉంది. 2023 నవంబరు నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.60వేలు ఉండగా ఈ ఏడాది ఇదే నెలలో రూ.1.27 లక్షలు ప్రస్తుతం ఉంది. అప్పట్లో 22 క్యారట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.55,400 కాగా ప్రస్తుతం రూ.1.17లక్షల వద్ద ఉంది. రానున్న శుక్ర మౌఢ్యమిలోనైనా బంగారం ధరకు కళ్లెం పడుతుందని అన్నివర్గాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా బండారులంక సిద్ధాంతి కాలెపు భీమేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి శుక్రమౌఢ్యం ప్రారంభమవుతుంది. ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు మార్గశిరమాసం. ఈ మాసంలో శంకుస్థాపనలు, గృహప్రవేశాలకు ముహూర్తాలు లేవు. ఈనెల 22, 23 తేదీల్లో వివాహాలకు ముహూర్తాలు ఉన్నాయి. ఈనెల 26 నుంచి శుక్రమౌఢ్యం ప్రారంభమై 2026 ఫిబ్రవరి 17 వరకు ఉంది. దాంతో 83 రోజుల శుక్రమౌఢ్యంలో వివాహాది శుభ కార్యక్రమాలు ఉండవని పేర్కొన్నారు.

## వీఆర్వోలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు



కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రంతో పాటు మొక్క ఇస్తున్న వీఆర్వోల సంఘ ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని గ్రేడ్-1, గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించాలని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. శుక్రవారం ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రంతో పాటు మొక్క ఇచ్చారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులతో భర్తీ చేయాలన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1గా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాను ఈ వారంలోనే పబ్లిష్ చేసి ఉద్యోగోన్నతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావుకు కూడా వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దాల బాపూజీ, సహాయ కార్యదర్శి అనిశెట్టి రామకృష్ణ, ప్రతినిధులు మేడిశెట్టి కిషోర్, సాధనాల యల్లేశ్వరరావు, అల్లాడి మల్లేశ్, శ్రీనివాసు, కె.స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ లిటరసీ సెంటర్లు ఏర్పాటు చేస్తాం

పిఠాపురంలో పైలట్ ప్రాజెక్టు

విశాఖ సీఐఐ సదస్సులో మురాలశెట్టి సునీల్‌కుమార్

పిఠాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తుతరాలకు సురక్షితమైన తాగునీరు, వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు, అక్వా కల్చర్‌కు పరిశుభ్రమైన సాగునీరు అందుబాటులో ఉండేలా చూసేందుకు వాటర్ లిటరసీ సెంటర్లను ఏపీలో నూతన ఆవిష్కరణగా ఏర్పాటు చేయనున్నట్టు గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వాటర్ లిటరసీ సెంటర్ల ఏర్పాటుపై శుక్రవారం ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిని పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో చేపడతామని తెలిపారు.



నీటి సంరక్షణ, సస్టెనబుల్ ప్రాక్టీసెస్, భూగర్భ జలాల నిర్వహణ, నీటి కాలుష్యాన్ని తగ్గించడం, నీటివనరుల పరిరక్షణ, టెక్నాలజీ ఇంప్లిమెంటేషన్, ప్లాస్టిక్ అండ్ ఇండస్ట్రియల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్క్‌షాపుల నిర్వహణ తదితర అంశాలను ఈ సెంటర్ చేపడుతుందని వివరించారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం, కళాశాల, పాఠశాల విద్యార్థులకు అవగాహన పెంచే విధంగా క్షేత్రస్థాయి పర్యటనల ఏర్పాటు, సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కాన్సెప్ట్ వినూత్నంగా ఉందని పలువురు ప్రతినిధులు అభినందించారు. తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.




సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రామస్వామి

## రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

సహకార వారోత్సవాల ప్రారంభోత్సవంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి కోరారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను కాకినాడలోని డీసీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ప్రారంభించారు. సహకార సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించి అధికారులు, సిబ్బందితో సహకార ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ డీసీసీబీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. చిన్న, సన్నకారు రైతులు, బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం సహకార వ్యవస్థ ఏర్పడిందన్నారు. సహకార వారోత్సవాలు దేశవ్యాప్తంగా సహకార ఉద్యమ అభివృద్ధికి నాంది పలుకుతాయన్నారు. ప్రతి సొసైటీ ప్రగతి పథంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహకార వారోత్సవాల జిల్లా ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, డీజీఎం శ్రీధర్‌చౌదరి, డీసీవో శ్రీనివాస రెడ్డి, ఏజీఎంలు, మేనేజర్లు, అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం

## ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పిఠాపురం

- 19 ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్లు
- కామన్ గుడ్ ఫండ్ నిధుల విడుదలకు దేవదాయ శాఖ అంగీకారం
- అందులో పాదగయ క్షేత్రానికి రూ.6 కోట్లు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయింపు



పాదగయ క్షేత్రం



ప్రణాళికను వేగవంతంగా అమలు చేయాలి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పాడా అధికారులతో సమీక్ష

పిఠాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవత అయిన పురుహూతికా అమ్మవారు, స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, శ్రీపాదశ్రీవల్లభులు పుట్టిన పిఠాపురాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దేందుకు ప్రణాళికను వేగవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పాదగయ క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం తదితర ప్రధాన ఆలయాలతో పాటు 19 దేవాలయాల అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ.20 కోట్లు విడుదల చేసేందుకు దేవదాయ శాఖ అంగీకరించిందని వెల్లడించారు. పవన్‌కల్యాణ్ శుక్రవారం మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పిఠాపురం పాడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి, పురుహూతికా ఆలయాల అభివృద్ధికి రూ.6కోట్లు వెచ్చించనున్నామని, ఈ నిధులతో పిండప్రదాన మందిరం, అన్నదాన మండపం నిర్మాణంతో పాటు పాదగయ పుష్కరిణి మరమ్మతులు చేపడతామని వివరించారు. ఈ పనుల నిర్వహణకు దేవదాయ శాఖ ఆమోదం లభించిందన్నారు. శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరయ్యాయన్నారు. సీతారామాంజనేయ స్వామి ఆశ్రమం అభివృద్ధికి రూ.60లక్షలు, జైగణేష్ ఆలయ అభివృద్ధికి రూ.65లక్షలు, చిత్రాడలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.70లక్షలు వెచ్చించనున్నామని చెప్పారు. పురుహూతికా అమ్మవారు, కుక్కుటేశ్వరస్వామి ఆలయాలు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రాజెక్టు తయారు చేస్తున్నట్టు తెలిపారు. టెంపుల్ టూరిజంలో భాగంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

పిఠాపురం మండలం నవఖండ్రవాడలోని నక్కుళ్లమ్మ ఆలయం, రామాలయం, గొల్లప్రోలులోని సిరితల్లి ఆలయం, తాటిపర్తిలోని మార్కండేయ సమేత భద్రావతి భావనారుషి ఆలయాలను ధూప, దీప, నైవేద్యం పథకం పరిధిలోకి తీసుకునేందుకు దేవదాయ శాఖ అంగీకారం తెలిపిందన్నారు. సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచే ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. నిధుల మంజూరు అంగీకారం తెలిపిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీకం చివరి సోమవారం, మాసం ముగిసే రోజున భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు పటిష్ఠంగా ఉండాలని సూచించారు.

## వాడపల్లి వెంకన్న ఆలయానికి రెండు బ్యాటరీ కార్లు

బహూకరించిన విక్టరీ సంస్థ అధినేత వెంకటరెడ్డి



బ్యాటరీ కారును ప్రారంభించిన అనంతరం స్వయంగా నడుపుతున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రావులపాలేనికి చెందిన విక్టరీ సంస్థ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి రూ.20లక్షలతో రెండు బ్యాటరీ కార్లను కొనుగోలు చేశారు. వీటిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే, దాతలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ వాహనాలను వినియోగిస్తామని దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, దాతలు పాల్గొన్నారు.

# పిల్లలకు సనాతన ధర్మం నేర్పించాలి

● దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి ఆనంద తీర్థాచార్యులు
● టీటీడీ ఆధ్వర్యంలో గోదావరికి మహా నీరాజనం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందతీర్థాచార్యులు



కార్యక్రమానికి హాజరైన కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత, అధికారులు

కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు సనాతన సంప్రదాయాలను నేర్పించాలని తితిదే దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు అన్నారు. టీటీడీ ధర్మప్రచారంలో భాగంగా కార్తీకమాసం శుక్రవారం సాయంత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు మహా మంగళహారతిని అందజేశారు. ముందుగా టీటీడీ నుంచి తీసుకు వచ్చిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు విశిష్టపూజలు నిర్వహించారు. అనంతరం గణపతి, విశ్వక్సేన, కలశ, షోడశ, గోదావరి పూజ నిర్వహించారు. తర్వాత గోదారమ్మకు వాయినం అందజేశారు. అనంతరం ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో గోదారమ్మకు వివిధరకాల హారతులు సమర్పించారు. వేలాదిగా భక్తులు, మహిళలు తరలివచ్చారు. దీంతో గోష్పాదక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా జాయింటు కలెక్టర్ మేఘాస్వరూప్, అడిషనల్ ఎస్పీ ఎన్.మురళీకృష్ణ, ఆర్డీవో రాణి సుస్మిత, మున్సిపల్ చైర్మన్ బావన రత్నకుమారి, మద్ది పట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు సూరపనేని చిన్ని, బీజేపీ రాష్ట్ర నాయకుడు పరిమి రాధాకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వరరావు, సూర్యదేవర రంజిత్,



తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, పట్టణ సీఐ పి. విశ్వం, రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, పిల్లల మర్రి మురళీకృష్ణ, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంట రాజు, మున్సిపల్, విద్యుత్‌శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు వెంకటేశ్వరస్వామి వారి ప్రసాదాన్ని పంపిణీ చేసి వేదాశ్వీరచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆనంద తీర్థాచార్యులు గోష్పాదక్షేత్రంలో గత 17 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అనంతరం అల్లూరి ఇంద్రకుమార్, జాయింట్ కలెక్టర్ మేఘాస్వరూప్, అడిషనల్ ఎస్పీ ఎన్.మురళీకృష్ణ మాట్లాడారు. గోదావరి హారతి కార్యక్రమం దిగ్విజయం కావడానికి సహకరించిన అధికారులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండెక్కిన గుడ్డు

● రూ.6.10కి చేరిక ● గడిచిన నాలుగేళ్ల కంటే... రికార్డు స్థాయిలో పెరుగుదల ● పౌల్ట్రీ పరిశ్రమకు ఊరట



మండపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూలేని విధంగా నాలుగేళ్ల తర్వాత కోడి గుడ్డు ధర రికార్డు స్థాయికి చేరుకుంది. కోవిడ్ సమయంలో రూ. 6.20 పైసలు పలికినప్పటికీ రెండు మూడురోజుల కంటే ధర నిలవలేదు. ఆ తర్వాత ఇప్పుడు రూ.6.10కి చేరటంతో కోళ్లపరిశ్రమ రైతులకు కాస్త ఊరట కలిగింది. ఉమ్మడి జిల్లాలో 300 వరకు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వాటిలో 1.40 కోట్ల మేర కోళ్లను పెంచుతుండగా, వాటి ద్వారా నిత్యం 1.10 కోట్ల మేర గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. వీటిలో 40 శాతం స్థానిక అవసరాలకు వాడుతుండగా, మిలిగిన గుడ్లు 60 శాతం మేర బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా, తదితర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుంటాయి. కాగా, శీతాకాలం కావటంతో వచ్చే జనవరి వరకు ధర నిలకడగా ఉంటుందని కోళ్ల ఫారాల నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ఫ్రెంచి సంస్కృతి అవగాహనకు

# చలన చిత్రోత్సవాలు దోహదం

● ఆర్‌ఏ అంకితేకుమార్ ● యానాంలో మూడు రోజులపాటు చలన చిత్రోత్సవాల ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఏ అంకిత్‌కుమార్

యానాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత్, ఫ్రెంచి దేశాల స్నేహ సంబంధాలు బలోపేతం కావడానికి చలన చిత్రోత్సవాలు దోహదపడతాయని యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, అలయెన్స్ ఫ్రాన్సిస్ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ నల్లం అన్నారు. ఫ్రెంచ్ సంస్కృతిలోని భావోద్వేగాలు జీవన విధానం, చలనచిత్ర రీతుల్ని తెలియజేయడం కోసం యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మూడురోజులపాటు ఫ్రెంచ్ చలన చిత్రోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్ర మాలలో పాల్గొనేందుకు ఫ్రాన్స్ అంబసిడర్ (రాయబారి) తెర్రీ మాత్యో యానాం వచ్చారు. అలయెన్స్ ఫ్రాన్సెస్, పుదుచ్చేరి, యానాం సహకారంతో మూడు రోజుల పాటు జరుగనున్న చలన చిత్రోత్సవాన్ని ఫ్రాన్స్ రాయబారి తెర్రీ మాత్యో ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్రెంచి కౌన్సిల్ జనరల్ ఎటెన్నీ రోలాండ్ పీగే, అలయన్స్ ఫ్రాన్సెస్ డైరెక్టర్ లారెంట్ జాలికస్,అలయెన్స్ ఫ్రాన్సిస్ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ నల్లం పాల్గొన్నారు. ఈసందర్బంగా డాక్టర్ నల్లం మాట్లాడుతు యానాంలో ఫ్రెంచి బాషా, సంస్కృతి పట్ల అసక్తి పెంచడం కోసం ఫ్రెంచి శిక్షణ తరగతుల్ని యానాంలోని రీజెన్సీ పాఠశాల, రాజీవ్‌గాంధీ పాఠశాలలో ప్రారంభించామన్నారు. 20 నిమిషాల నిడివిగల కబ్రి ఇమాంజ్ సలాడ్ చిత్రాన్ని తొలిరోజు ప్రదర్శించారు.

కార్యక్రమంలో ఎస్పీ వరదరాజన్, డాక్టర్ నల్లం వెంకటరామయ్య, సాధనాల బాబు, తదితరులు పాల్గొన్నారు.

# అప్పులు తీర్చేందుకు .. అడ్డదారులు

● స్కూటీలపై వెళ్లే మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లు
● ఉమ్మడి జిల్లాలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు
● 112 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా
● కేసును ఛేదించడంలో కృషి చేసిన సిబ్బందికి రివార్డులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగుల్లో డబ్బులు పోగొట్టుకోవడంతో పాటు స్నేహితుల వద్ద కూడా అప్పులు చేసి, తీరా వాటిని తీర్చలేక దొంగతనాల బాట పట్టాడు ఓ వ్యక్తి. ముఖ్యంగా స్కూటీలపై ప్రయాణించే మహిళలనే లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతుండేవాడు. వివరాల్లోకి వెళితే ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన సాధనాల వెంకటేష్ (35) ప్రస్తుతం కాకినాడలో ఓ అద్దె ఇంట్లో ఉంటూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. దీంతో పోలీసులకు చిక్కడంతో శుక్రవారం ఆయన్ని అరెస్టు చేశారు. ఈ మేరకు అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనా విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వివరాలివి.. కాకినాడలో తన తల్లిదండ్రులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్న సాధనాల వెంకటేష్ ఏపీ 05081709 నెంబరు గల గ్లామర్ మోటారు సైకిల్‌పై తిరుగుతూ తరచూ ఆ బండి నెంబరు ప్లేట్లు ఎవరూ గుర్తు పట్టకుండా తారుమారు చేస్తూ ముఖానికి మాస్క్, తలకు టోపీ పెట్టుకుని స్కూటీపై వెళ్లే మహిళలను వెనుక నుంచి వెంబడించి వారి మెడలో చైన్ లాక్కొని అక్కడి నుంచి పరారవుతుండేవాడు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చేసిన నేరాలకు సంబంధించి అతడి నుంచి 112.784 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. వీటిలో ఐదు బంగారు గొలుసులు, 10 గ్రాముల బంగారం ముక్కతో పాటు గ్లామర్ మోటారుసైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై ఆరు కేసులు నమోదుచేసి అరెస్టు చేశారు.

**నేర వివరాలు ఇలా..**

కాకినాడ వలసపాకలలో గల పబ్లిక్ స్కూలు రోడ్డు దగ్గరలో మే 11, 2023న స్కూటీపై వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు దోపిడీ. మే 9, 2023లో కాకినాడ ఐడీఎల్ కళాశాల నుంచి సామర్లకోట వెళ్లే రోడ్డులో వంతెన వద్ద స్కూటీపై ఉన్న మహిళ మెడలో నుంచి గొలుసు. ఈ ఏడాది మే 11, 2025 కరప మెయిన్ రోడ్డు వద్ద స్కూటీపై కుమార్తెతో వెళుతున్న మహిళ మెడలో గొలుసు చోరీ. మే 16న ద్రాక్షారామ వద్ద గల వెంకటాయపాలెం దాడిన తరువాత ఆంజనేయస్వామి గుడి వద్ద ఇద్దరు మహిళలు స్కూటీపై కుందూరు వెళుతుండగా స్కూటీ నడుపుతున్న మహిళ మెడలో నుంచి మంగళసూత్రాలతు ఉన్న బంగారుతాడు చోరీ. అలాగే జూన్ 24న వెంటూరు వంతెన వద్ద స్కూటీపై వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసు, ఆగస్టు 20న ద్రాక్షారామ రిజిస్టర్ ఆఫీసు దాటిన తరువాత స్కూటీపై వెళుతున్న మహిళ మెడలోని గొలుసును చోరీ చేసినట్టు ఎస్పీ విలేఖరులకు వెల్లడించారు. సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ ఎం.వెంకటనారాయణ, ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్, రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కేసుల్లో నిందితుడి కోసం 250 సీసీ కెమెరాలను పరిశీలించడం ద్వారా అతడిని గుర్తించారు. ఈ కేసును ఛేధించడంలో కృషి చేసిన సీఐ, ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేసి వారిని అభినందించారు.

# ఆపరేషన్ గోదారి

**విజ్జేశ్వరం స్లువర్ స్లూయిజ్ నుంచి మురుగునీరు విడుదల**



విజ్జేశ్వరం బ్యారేజ్ వద్ద నుంచి స్లువర్ స్లూయిజ్ ఆపరేషన్ ద్వారా బయటకు వెళుతున్న మురుగునీరు

నిడదవోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి వరదలు వచ్చే వేళ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిలో కొట్టుకు వచ్చే మట్టి, చెత్తాచెదారాలు గోదావరి నది బ్యారేజీలో ఒక ప్రత్యేక బ్లాక్‌లోకి వెళ్లే విధంగా ఆనాడు కాటన్ మహాశయుడు గోదావరి నదిపై బ్యారేజ్ నిర్మించాడు.ప్రతి ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు దిగువకు కొట్టుకు వచ్చే మట్టి, చెత్త విజ్జేశ్వరం బ్యారేజీ వద్ద బ్లాక్‌కు చేరుతుంది. దీనిని నీటి పారుదల శాఖాధికార్లు ఏడాదికి ఒకసారి స్లువర్ స్లూయిజ్ ఆపరేషన్ పేరుతో 4గేట్లను పైకెత్తి దిగువకు విడుదల చేస్తారు. శుక్రవారం నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద హెడ్ వర్క్స్ ఈఈ జి.శ్రీనివాసరావు స్విచ్చాన్ చేసి స్లువర్ స్లూయిజ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ఆపరేషన్ ద్వారా 4 గేట్లు పైకెత్తి సుమారు 11.401 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కార్యక్రమంలో కె.ఆనంద్‌బాబు, డి.రాధాకృష్ణ, ఆర్.సునీల్‌బాబు, జి.జయవిక్రమ్, జి.రాజేష్, ఎ.మీరాబాబు పాల్గొన్నారు.



స్లువర్ స్లూయిజ్ స్విచ్చాన్ చేస్తున్న ఈఈ శ్రీనివాసరావు

# ఓఎన్జీసీతో మత్స్యకారుల ఉపాధికి ఇబ్బంది రాకూడదు

**కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్**





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ పైపులైన్ల వల్ల మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గత ఆగస్టు 22న ఓఎన్జీసీ అగ్ని ప్రమాదంతో మత్స్య సంపదకు, మత్స్యకారుల జీవనోపాధికి జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి ఏర్పాటుచేసిన సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సైంటిస్ట్ డాక్టర్ జోయ్‌తో కలిసి ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. యానాం పరిపాలనా అధికారి అంకిత్,రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులకు ఏ నష్టం కలగకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ సముద్రంలో మత్స్య సంపద గతం కంటే ఇప్పుడు గణనీయంగా తగ్గిందన్నారు. ఇలాంటి అగ్ని ప్రమాదాల వల్ల ప్రజల్లో భయాందోళనలు కలుగుతాయని, వారికి నమ్మకం కల్గించే లా కంపెనీలు వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఓఎన్జీసీ అగ్ని ప్రమా దంతో ఏర్పడిన కాలుష్యం కాకినాడ తీర ప్రాంతానికి చేరుకుని మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తీసిందన్నారు. గతంలో ఓఎన్జీసీ, జీఎస్‌పీసీ పరిహారం కాకినాడ మత్స్యకారులకు ఇవ్వలేదన్నారు. ఈసారి మత్స్యకారులకు కూడా పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో ఓఎన్జీసీ ఈడీ ప్రబల్ సేన్‌గుప్తా, జిల్లా మత్స్య శాఖ అధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

## రెవెన్యూ జట్టుకు అభినందనలు

అనంతపురంలో ఈ నెల 7,8,9 తేదీల్లో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడల్లో కాకినాడ జట్టు 30 పాయింట్లతో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించింది. ఈ నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం కాకినాడ రెవెన్యూ క్రీడాకారుల జట్టును కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. మార్చ్‌ఫాస్ట్ విభాగంలో కాకినాడ జిల్లా జట్టు ప్రథమ, పురుషుల విభాగంలో టగ్ ఆఫ్ వార్‌లో ప్రథమ, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, చదరంగంలో ద్వితీయ, త్రోబాల్‌లో ద్వితీయ స్థానాల్లో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడలకు సహకారం అందించిన కలెక్టర్‌కు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, వీరబాబు, తహశీల్దారు గోపాలకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

# యానాంలో ఫ్రాన్స్ అంబాసిడర్ పర్యటన



ఫ్రాన్స్ అంబాసిడర్ మాత్యో చర్చిస్తున్న ఆర్‌ఏ అంకిత్‌కుమార్

యానాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ఫ్రాన్స్ అంబాసిడర్ థియరీ మాథౌ పర్యటించారు. రెండురోజుల పర్యాటనలో భాగంగా ఆయన యానాం వచ్చారు. పుదుచ్చేరి నుంచి యానాం వచ్చిన ఆయనకు ప్రభుత్వ అతిథి గృహం వద్ద యానాం పరిపాలనాధికారి అంకిత్‌కు మార్, ఎస్పీ వరదరాజన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం యానాంలోని పలు పర్యాటక ప్రాంతాలను పరిశీలించారు. ఫ్రెంచ్ సంస్కృతిలోని భావోద్వేగాలు, జీవన విధానం, చలనచిత్ర రీతుల్ని తెలియజేయడం కోసం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మూడు రోజులపాటు ఫ్రెంచ్ చలన చిత్రోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో మాత్యో యానాం పర్యటనకు వచ్చారు.

# నరసన్న ఆలయంలో రూ.లక్ష టిక్కెట్ కౌంటర్



కౌంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దాతలు, అధికారులు, అర్చకులు

అంతర్వేది, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాలకొల్లుకు చెందిన వాకాడ అప్పారావు-విశాలాక్షి దంపతులు దేవస్థానం వినియోగార్థం సుమారు రూ. లక్ష విలువైన టిక్కెట్ కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. ముందుగా అర్చకులు టిక్కెట్ కౌంటర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించగా దాతలు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం దాతలకు వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు.

# వలలో పడి మత్స్యకారుడి మృతి



మృతుడు కృష్ణ

కొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సముద్రంపైకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు దురదృష్టవశాత్తూ వల వేసేటప్పుడు కాలు జారీ వలలో చిక్కుకొని మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో జరిగిది. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పాడ శివారు జగరాజుపేటకు చెందిన కారే కృష్ణ(48) అదే గ్రామానికి చెందిన పిరమాళ్ల దుర్గా ప్రసాద్‌కు చెందిన జాయింట్ బోట్లపై శుక్రవారం ఉదయం మరో 20 మందితో కలిసి ఉప్పాడ మినీ హార్బర్ నుంచి వేటకు వెళ్లారు. చేపలను వేటాడేందుకు వలను సముద్రంలోకి విసిరేటపుడు బోటు నుంచి కాలుజారి వలకు చిక్కుకొని సముద్రంలో గల్లంతయ్యాడు. బోటులో వేటకు వెళ్లిన మత్స్యకారులు సహచర మత్స్యకారులతో సముద్రంలో గాలింపు చేపట్టారు. కృష్ణ మృతదేహం కాకినాడ సమీపంలో హార్బర్‌లో లభ్యమైందని సర్పంచ్ మేరీ జాన్ తెలి పారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## టీడీపీ నేతను గాయపర్చిన వ్యక్తికి రిమాండ్

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురానికి చెందిన టీడీపీ నేత దేవస్థానం చైర్మన్ వేగశ్న ప్రసాద్‌రాజును కొట్టి గాయపర్చిన వేగశ్న గోపిరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత సెప్టెంబరు నెలలో డబ్బులు విషయంలో ప్రసాద్‌రాజు, గోపిరాజు మధ్య వాగ్వాదం జరిగి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ప్రసాద్‌రాజును గోపిరాజు కొట్టి గాయపర్చాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం గోపిరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

## పాము కాటుతో మహిళ మృతి

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో ఓ మహిళ మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన పల్లికొండ కుమారి(40) గురువారం రాత్రి పక్కంటి వారికి పాలు ఇవ్వ డానికి వెళ్తుండగా పాము కాటు వేసినట్టు అనిపించడంతో భర్త అన్నవరానికి తెలియజేసింది. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

## తల్లికి బాలిక అప్పగింత

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. సీఐ విద్యాసాగర్ తన సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.బాలిక తిరుపతిలో ఉన్నట్టు గుర్తించి సురక్షితంగా ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# భార్యపై అనుమానంతో ఇంటికి నిప్పు

» మంటలను అదుపు చేసిన స్థానికులు » భర్త అరెస్టు » ఈదరపల్లిలో ఘటన



వంటింట్లో దహనమైన సామగ్రి

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకున్న భర్త గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆమె ఉంటున్న ఇంటికి నిప్పు పెట్టి చంపాలని ప్రయత్నించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి పోలేరమ్మ గుడి సెంటర్‌కు చెందిన విజయ దుర్గాభవానీకి అమలాపురానికి చెందిన జంగా శివ అలియాస్ సురేష్‌తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. దుర్గా భవానీ తల్లికి అరోగ్యం బాగోకపోవడంతో పిల్లలతో కలిసి కొన్ని రోజుల క్రితం పుట్టింటికి ఈదరపల్లి వచ్చింది. అప్పటికే భార్యపై అనుమానం పెంచుకున్న శివ రాత్రి 1 గంట సమయంలో పెట్రోల్ సీసాలతో ఆ ఇంటికి చేరుకున్నారు. కిటికీల నుంచి లోనికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దాంతో ఒక్కసారిగా మంటలు రేగడంతో ఉలిక్కిపడ్డ భవానీ కుటుంబ సభ్యులు పెద్దపెద్ద కేకలు వేసి బయటకు పరుగులు తీశారు. అప్పటికే చుట్టుపక్కల వారు రావడం, స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. శివ వంట గదిలోకి పెట్రోల్ సీసా విసరడంతో మంటలు గ్యాస్ సిలిండర్ వద్దకు చేరుకుంటున్న సమయంలో అదుపు చేయడం వల్ల పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న శివను అదుపులోకి తీసుకున్నారు. భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# రాజమహేంద్రవరం



## నన్నయలో నూతన భవనాల పరిశీలన

దివాన్‌చెరువు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాలను వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, సీఎంవో కార్యాలయ ప్రతినిధులు ఇక్బాల్, రంగాచౌదరి పరిశీలించారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం వీసీ ప్రసన్నశ్రీని వారు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను చర్చించారు. అనంతరం నూతనంగా నిర్మించిన విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల భవనం, పరీక్ష భవనం, స్కూల్ ఆఫ్ కామర్స్ మరియు మేనేజ్మెంట్ స్టడీస్ భవనాలను వారు పరిశీలించారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ వారికి తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, విశ్వవిద్యాలయ అధికార్లు, ఇంజనీర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమాలు వెలుగు చూడడంతో రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని 39వ నెంబరు షాపుపై రెవెన్యూ అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. శుక్రవారం ఆర్డీవో కృష్ణనాయక్ రాజమహేంద్రవరంలోని 39వ నెంబరు రేషన్‌షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో సంబంధిత దుకాణంలోని స్టాకు, పంపిణీ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. స్టాక్‌కు ఆన్‌లైన్ రికార్డులకు మధ్య తేడాను గుర్తించారు. 360 కిలోల బియ్యం అదనంగా ఉండడంతో సంబంధిత డీలర్‌పై నిత్యావసర సరుకుల యాక్టు సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేసినట్టు ఆర్డీవో కృష్ణనాయక్ తెలిపారు. అక్రమాల నివారణ కోసం మొత్తం స్టాకును ఫ్రీజ్ చేశామని తెలిపారు. రేషన్ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు సహించబోమని ఆయన పేర్కొన్నారు.

## సొసైటీలను అభివృద్ధి చేయాలి

**జిల్లా సహకార అధికారి వెంకటరమణ.. పలుచోట్ల సహకార వారోత్సవాలు**

దివాన్‌చెరువు, నవంబరు14(ఆంధ్రజ్యోతి) : కొత్త వ్యాపారప్రణాళికల ద్వారా సంఘాలను అభివృద్ధిబాటలోకి తీసుకెళ్లాలని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ అన్నారు. భూపాలపట్నం వ్యవసాయ పరపతి సంఘంలో అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. తొలుత సొసైటీ అధ్యక్షుడు మద్దిరెడ్డి సుబ్బారావు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీసీవో పాల్గొని మాట్లాడారు. డివిజనల్ సహకార అధికారి ఎం.కనకదుర్గారెడ్డి మాట్లాడుతూ నిరంతర కృషి ద్వారానే అభివృద్ధి జరుగుతుందని, దానికి సాంకేతికతను జతచేయాలని సూచించారు. రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఈ ఏడాది సహకార వారోత్సవాల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ పాలక వర్గ సభ్యులు జెట్టి సత్యనారాయణ, బచ్చు నాగార్జున, డీసీఏవో జగన్నాథ్‌రెడ్డి, రామదాసు శిక్షణా కేంద్రం సిబ్బంది అయ్యప్ప పాల్గొన్నారు.

**బిక్కవోలు:** మండలంలోని కొంకుదురు సొసైటీలో సహకార జెండాను అధ్యక్షుడు చింతా శ్రీ నివాసరెడ్డి ఆవిష్కరించారు.ఈనెల 20 వరకూ వారోత్సవాలు నిర్వహిస్తామని రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పర్సన్ కొవ్వూరి సాంబశివారెడ్డి, సీఈవో శ్రీను, సూపర్‌వైజర్ రామారావు పాల్గొన్నారు.బిక్కవోలు,బలభద్రపురం, ఊలపల్లి, కొమరిపాలెం, మెళ్లూరు సొసైటీల్లో ఛైర్మన్లు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, ఎన్‌వీ సుబ్బారెడ్డి, తొండాపు నీరజాస్వాతి, డీవీఆర్, చవ్వాకుల గోపాలకృష్ణ వారోత్సవాలను ప్రారంభించారు.

## నేటి బాలలే రేపటి పౌరులు

- » ఘనంగా బాలల దినోత్సవం
- » జవహర్‌లాల్ నెహ్రూకు నివాళులు
- » విద్యార్థులకు పోటీలు..బహుమతులు
- » స్వీట్లు, పండ్లతో తిథి భోజనాలు

బిక్కవోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం చాచా నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం నిర్వహించారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పందలపాక హైస్కూల్లో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీడీ యువరాజారెడ్డి, బహుమతులు అందజేశారు. మెళ్లూరు హైస్కూల్లో నిర్వహించిన ఆటలు, పాటల పోటీల్లో విజేతలకు హెచ్ ఎం జి.లక్ష్మి బహుమతులు అందజేశారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమాదేవి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించి, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కాపవరం ప్రాథమిక పాఠశాలలో తిథి భోజనాల పేరుతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అరటిపండ్లు, స్వీట్లను అనపర్తికి చెందిన సత్తి జ్యోతి అందించారు. కొంకుదురు మెయిన్ పాఠశాలలో దాతలు స్వీట్లు, పండ్లను, పందలపాక హైస్కూల్లో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి స్వీట్లను తిథి భోజనంలో విద్యార్థులకు అందజేశారు.

**దివాన్‌చెరువు:** దివాన్‌చెరువులోని ప్రాథమిక పాఠశాల-2 బాలల దినోత్సవాన్ని జీజీయూలోని స్కూల్ ఆఫ్ ఫార్మశీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ఎండీ ధనరాజు మాట్లాడుతూ బాల్యం నుంచే చదువు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.రత్నరాజు, అధ్యాపకులు డి.కవిత, టి.దీపన్, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

**కడియం:** కడియపులంక పంచాయతీ వెంకయ్యపేటలో మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు చేయించిన కృతాలు, 1, 2 తరగతుల విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బ్యూలారత్నం, మార్గాని ఏడుకొండలు, వెంకన్నబాబు, గట్టి శ్రీనువాసు, ఛైర్‌పర్సన్ సంధ్యారాణి పాల్గొన్నారు. కడియం హైస్కూల్లో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంఈవో వై.నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులను ఉపాధ్యాయులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బూసి సువర్ణవేణి, జె.రమేష్, రామకృష్ణంరాజు, డేవిడ్, పాల్గొన్నారు. వేమగిరిలో ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి నల్లరాజు, బొర్రా సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కడియం: వెంకయ్యమ్మపేట మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కృత్యాలు

**అనపర్తి:** అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక బాలికోన్నత పాఠశాల, కేఏఆర్ పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ మల్లిడి పార్వతి పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం సిటీ:** స్థానిక రవీంద్ర విద్యానికేతన్‌లో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాలబాలికలకు న్యాయపరంగా ఉన్న ప్రయోజనాలు, హక్కులను వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో వాసుదేవరావు, డీఐ దిలీప్‌కుమార్, సీడబ్ల్యుసీ ఛైర్‌పర్సన్ సూర్యప్రభావతి,ఉమెన్స్ అండ్ ఛైల్డ్‌వెల్ఫేర్ పీడీ టి.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు పాత కూరగాయల మార్కెట్ వద్ద నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీకే మాట్లాడుతూ నెహ్రూను కొంతమంది పనిగట్టుకుని విమర్శిస్తున్నారని, వాస్తవానికి ఆయన దేశానికి చేసిన అభివృద్ధి ఇప్పటికీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తోందన్నారు. పంచవర్ష ప్రణాళికలు, దేశంలో నిర్మించిన భారీ ప్రాజెక్టులు ఆనాడు చేసినవేనని ఇప్పుడు ప్రధాని మోదీ దేశాన్ని అప్పుల పాలుజేశారని విమర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ వడయార్, దేవత సుధాకర్, అడుసుమిల్లి రమేష్, చంద్రశేఖర్, పట్నాల శ్రీనివాస్, బత్తిన చంద్రరావు, డాక్టర్ రాజశేఖర్, కిషోర్ కుమార్‌జైన్ పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం కల్చరల్:** స్థానిక టౌన్‌హాల్‌లోని జుబ్లీ లైబ్రరీ కార్యదర్శి ఆకుల వీర్రాజు, మెయిన్‌రోడ్డులోని గాంధీ, నెహ్రూ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, నల్లం శ్రీను, కె.సత్యనారాయణ, కె.కేశవరావు, కె.కాశీవిశ్వనాథ్,వి.చిన్ని,లైబ్రేరియన్ వీటీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం అర్బన్:** రాజమహేంద్రవరంలోని రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి-బాలల దినోత్సవం నిర్వహించారు. ముందుగా కళాశాల డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య, ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్ తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీవో దంటు వీరవెంకటరావు, అధ్యాపకులు కీర్తన, ప్రియాంక, సౌజన్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## బీహార్ ఎన్నికల్లో బీజేపీ విజయంపై హర్షం



రాజమహేంద్రవరంలో నాగేంద్రకు మిఠాయి తినిపిస్తున్న దత్తు

అనపర్తి, నవంరుబ 14 (ఆంధ్రజ్యోతి): ప్రగతి కాముకులకు ప్రజల ఆశీర్వాదం ఎల్లపుడూ ఉంటుందని బీహార్ ఎన్నికలు రుజువు చేశాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బీహార్ ఎన్నికలలో ఎన్డీయే కూటమి భారీ విజయం చేజిక్కించుకున్న సందర్భంగా శుక్రవారం అనపర్తి, రంగంపేటల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చారు. అనపర్తి దేవీచౌక్‌లో ఎమ్మెల్యే కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని, ఆయన నాయకత్వాన్ని దేశమంతా కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి కృష్ణ, రావాడ నాగు, ఎన్ఆర్‌కే ప్రసాదరెడ్డి, గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, ద్వారంపూడి ఈశ్వరరెడ్డి, నూతిక బాబూరావు పాల్గొన్నారు.

**కోరుకొండ:** స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి బీజేపీ మండలాధ్యక్షుడు అడపా సుధీర్‌కుమార్, మద్దిపాటి రజని ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని వికసిత్ భారత్‌కు బీహార్ ఎన్నికలు విజయం ఒక ఉదాహరణ అన్నారు. ఇదే స్ఫూర్తితో బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి మీనాక్షిరెడ్డి, చీర్ల రాధాకృష్ణ, పత్తూరి నరసింహమూర్తి, తగరంపూడి గణపతి, ఇసుకపల్లి రామకృష్ణ, టీశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

**గోకవరం:** గోకవరంలోని సీఎండీ లేఅవుట్, వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో బాణసంచా కాల్చడంతో పాటు, స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు,మట్టా మంగరాజు, ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ బీహార్ స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఏపీలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు.కార్యక్రమంలో బత్తుల వెంకన్నబాబు, వరసాల ప్రసాద్, పెద్దాడ వెంకన్నదొర, మణికంఠ,పైలా శ్రీనివాసరావు, చోడిశెట్టి గోపీనాథ్,ముప్పిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**కడియం:** కడియంలో బీజేపీ మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలు జరిపారు. ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారని, అందుకే ఎక్కడ ఎన్నికలు జరిగినా ఎన్‌డీఏ కూటమికి పట్టం కడుతున్నారన్నారు. కార్యక్రమంలో చిక్కాల ఈశ్వరరావు, గారపాటి తాతబ్బాయి, దాసరి ముత్యం, పాటంశెట్టి రాజేష్, గుర్రాల రామ్మోహనరావు, మర్రి శంకర్, చల్లా అంజిబాబు, కొత్తపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం అర్బన్:** రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలోను, క్వారీ మార్కెట్ సెంటర్లోను పార్టీ శ్రేణులు విజయోత్సవాన్ని జరుపుకున్నాయి. బాణసంచా కాల్చారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ బిహార్‌లో మొత్తం 243 స్థానాలకు గాను 203 స్థానాల్లో బీజేపీ కూటమి విజయం సాధించడం బిహార్ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వానికి ఇస్తున్న మద్దతుగా అభివర్ణించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, యానాపు ఏసు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్య సింగ్, అడబాల రామకృష్ణ, మోది సత్తిబాబు, పాతూరి రవిశంకర్, మద్దిపాటి స్వర్ణ రజని, సూర్యప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

## భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలి

**ఉమామార్కండేయ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి**

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమా మార్కండేయ స్వామి ఆలయానికి నియమించిన నూతన పాలక మండలి భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. గోదావరి బండ్ వద్ద ఉన్న ఉమామార్కండేయ స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం ఆలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ నగర చరిత్రలో మొట్టమొదటి సారిగా నగరంలో అంతర్భాగమైన రాజస్థానీలకు చెందిన వ్యక్తి మదన్ రాజ్ పురోహిత్‌ను దేవస్థానం ఛైర్మన్‌గా నియమించామన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ, ఆధ్యాత్మిక భావంతో భక్తులకు సేవలందించడం బాధ్యతగా భావించాలని నూతన కమిటీకి ఎమ్మెల్యే ఆదిరెడ్డి సూచించారు.అనంతరం ఎమ్మెల్యే వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అధికారులను నూతన కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, వై.శ్రీను, నక్కా దేవి వరప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## భూములిచ్చిన ప్రతీ ఒక్కరికి పరిహారం అందిస్తాం

**ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**

రంగంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏడీబీ రోడ్డు అభివృద్ధికి భూములిచ్చిన ప్రతీ ఒక్కరికి పరిహారం అందిస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.శుక్రవారం రంగంపేటలో ఏడీబీ రోడ్డుకు భూములిచ్చిన రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో కృష్ణనాయక్ అభ్యంతరాలను స్వీకరించారు. ఏడీబీ రోడ్డు నిర్మాణంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం, డ్రైనేజీ సౌకర్యం, రక్షణ గోడలు వంటి అంశాలపై రంగంపేట, కోటపాడు, వెంకన్నపేట గ్రామస్థుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకంతో పనులు నిలిచిపోయాయని దీంతో అనేక ఇబ్బందులు తలెత్తాయన్నారు. నష్టపరిహారం రూ.4.90 కోట్లు చెల్లించాల్సి ఉందని, పరిహారంపై అభ్యంతరాలుంటే అధికారులకు తెలియజేయవచ్చునన్నారు. పదేళ్ల క్రితమే జాబితా తయారైందని, ఇప్పుడు అదనంగా పరిహారం ఎంత ఇవ్వగలమనే దానిపై చర్చ జరగాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీబీ రోడ్డు అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

**రైతుకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే బత్తుల, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి**



కోరుకొండలో ధాన్యాన్ని తూకం వేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి

కోరుకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని రైతుకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండలం బూరుగుపూడిలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు, సీఈవో ఈగల సుదర్శనరావుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో వారు మాట్లాడారు. అనంత రం కోరుకొండ రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా రైతు భరోసా కేంద్రాల వద్దకు వచ్చి సరైన ధరకు ధాన్యాన్నివిక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ తనకాల వెంకటరమణమ్మ, కోరుకొండ, శ్రీరంగపట్నం సొసైటీల అధ్యక్షులు బత్తుల గోపాలకృష్ణ, అడపా వీరబాబు, సీఈవో ఆకుల వెంకటరమణ, డైరెక్టర్లు సుంకర శ్రీనివాస్, దేవన దుర్గాప్రసాద్, నాయకులు తనకాల నాగేశ్వరరావు, పుప్పాల వెంకటరత్నం, మళ్ల అప్పల నర్సారావు, మాతా సీతారాముడు, పలువురు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 కోట్లతో విద్యుత్ డివిజన్ కార్యాలయ భవనం

రాజానగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ డివిజన్ కార్యాలయం నూతన భవన నిర్మాణాలు రూ.3 కోట్లు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ ఆఫీస్, సబ్ డివిజన్ ఆఫీస్, రూరల్ ఎలక్ట్రిసిటీ కార్యాలయాలు వేర్వేరు ప్రాంతాల్లో ఉండడం వల్ల వినియోగదారులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారన్నారు. ఈ మూడు కార్యాలయాలను ఒకే చోట కేంద్రీకృతం చేయాలనే ఉద్దేశం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. దీంతో వినియోగదారులకు విద్యుత్ సంబంధిత సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్విరాజ్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## చిన్నపిల్లల ఆరోగ్యం జాగ్రత్త

**డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి**

రాజమహేంద్రవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమె ప్రభుత్వాస్పత్రిలోని సత్వర చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. చికిత్స పొందుతున్న పిల్లలో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. పిల్లల్లోని ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సమయానికి వైద్యసేవలు అందిస్తే వాళ్లు ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన జీవితాన్ని గడుపుతారన్నారు. అనంతరం ఓ ప్రైవేటు హైస్కూల్లో జరిగిన వేడుకలకు హాజరయ్యారు.పిల్లలు చదువు తోపాటు సంస్కారం, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు.పెద్దలను గౌరవించాలని చెప్పారు.

## కొమరేశ్వరుడికి లక్షపత్రి పూజ



సీతానగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముగ్గళ్ల శివాలయంలోని శ్రీ ఉమా పార్వతి కొమరేశ్వరస్వామికి శుక్రవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు గణపతి పూజ, ఏకాదశి రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, పార్వతిదేవికి లక్ష కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన జరిపించారు. 19 మంది రుత్వికుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్


సీతానగరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సీతానగరం కైలాస గిరి రేవు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక వీఆర్వో నందీశ్వరరావు సీజ్ చేశారు. దీంతో కైలాసగిరి ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అధికారులు అడ్డుకొంటున్నారని సమాచారం అందుకున్న కొన్ని ట్రాక్టర్లు ఇసుక దించేసి ఖాళీగా వెళ్లిపోయాయి. కైలాస గిరి రేవును ఉంచి గొల్లల రేవు వద్ద ఇసుక తరలిస్తున్న యాళ్ల సత్తిబాబుకు చెందిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## 26న రైతు, కేంద్ర కార్మిక సంఘాల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనం రూ.35,000 అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఇది అమలు చేసే వరకూ పోరాటం ఆగదని పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 26న చేపట్టబోయే నిరసన ఆందోళనలో ఆయా వర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## గ్రంథాలయాలు.. సామాజిక విద్యా కేంద్రాలు

**కొంకుదురు గ్రంథాలయాధికారి బాల.. గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం**




ఎస్‌కేఆర్ మహిళా కళాశాల లైబ్రరీలో విద్యార్థులు

బిక్కవోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు సామాజిక విద్యా కేంద్రాలని కొంకుదురు గ్రంథాలయాధికారి ఎస్.బాల తెలిపారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య స్వగ్రామమైన కొంకుదురులోని గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ముందుగా బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను పలువురు వక్తలు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కొమరిపాలెం డీసీ అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, సత్తి నాగిరెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**కడియం:** కడియం శాఖా గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చిలుకూరి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి మేకా వీరలింగం అధ్యక్షతన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని అన్నారు. విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలకు ప్రతీ రోజు వచ్చి పుస్తక పఠనం చేసి విజ్ఞానం పొందాలన్నారు.

**రాజమహేంద్రవరం కల్చరల్:** స్థానిక సీతంపేట గ్రంథాలయంలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పంతం కొండలరావు ముఖ్య అతిథిగా విచ్చేయగా టీడీపీ వార్డు ఇన్‌చార్జి బుడ్డిగ రవి ప్రారంభించారు. సరస్వతి దేవి, చాచా నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.వెంకటరమణ, చెక్కా తాతారావు, డి.రాజు, పిచ్చుక రాం బాబు, ఎ.కృష్ణ పాల్గొన్నారు. స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి ప్రారంభించారు. లైబ్రరీని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రతి విద్యార్థి రోజువారీ పఠనం అలవాటు చేసుకోవడం ద్వారా మహత్తరమైన లక్ష్యాలను సాధించవచ్చని వక్తలు పేర్కొన్నారు.కార్యక్రమంలో అకాడమీ కోఆర్డినేటర్ ప్రబల శ్రీవల్లి, అన్నపూర్ణదేవి, లైబ్రరియన్ ప్రియరంజని, నీరజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బీఈడీ కళాశాలలో వారోత్సవాలను ప్రిన్సిపాల్ కె.బ్రహ్మచారి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా శ్రీదేవి విచ్చేశారు. స్థానిక గౌతమీ గ్రంథాలయ ప్రాంగణంలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. నెహ్రూ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్వప్న కళానిలయం నాట్యాచారిణి కొప్పిసీడి స్వప్న స్వాగత నృత్య ప్రదర్శన చేసింది. అరిపిరాల నారాయణరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా గౌతమి సంస్థల డైరెక్టర్ సుంకర రవికుమార్ విచ్చేశారు. కార్యక్రమంలో పీవీఎస్ కృష్ణారావు, గ్రంథాలయాధికారి శ్రీదేవి, సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.





వేదికపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి



సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఏఎంజీ ఎంవోయూ

# మరో ముందడుగు

- సర్కారుతో ఏఎంజీ మెటల్ ఒప్పందం
- రూ.44 వేల కోట్లతో పరిశ్రమ
- యు.కొత్తపల్లిలో ఏర్పాటు

**ఈ పరిశ్రమలో ఏం చేస్తారంటే..**
ఈ సంస్థ బాక్సైట్ ఖనిజం నుంచి తీసిన అల్యూమినాను ముడిపదార్థంగా ఉపయోగించి అల్యూమినియంను ఇంగోట్స్ రూపంలో తయారు చేస్తుంది. వీటిని కరిగించి ఐరన్ బిల్లెట్స్, వైర్ రాడ్‌లు, అల్యూమినియం షీట్లు, కాయిల్స్ వంటివి తయారు చేస్తారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)
విశాఖ పెట్టుబడుల సదస్సులో కాకినాడకు భారీ పెట్టుబడి వచ్చింది. రూ.44వేల కోట్లతో ఏఎం గ్రీన్ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ సమక్షంలో ఏఎం గ్రీన్ ఒప్పందంపై సంతకం చేసింది. పిఠాపురం నియోజకవర్గంలోని యు.కొత్తపల్లి మండలంలో ఈ కంపెనీ ఏర్పాటుకానుంది. కంపెనీ స్థాపనలో భాగంగా భూమి, భూ అభివృద్ధికి రెండు దశల్లో రూ.1800 కోట్లు, భవనాలు, ఇతర సివిల్ పనులకు రెండు దశల్లో రూ.2,950కోట్లు, ప్లాంట్, ఇతర యంత్రాలకు రెండు దశల్లో రూ.30,300కోట్లు, ఇంకా ఇతర ఖర్చులు కలిపి మొత్తం తొలిదశ కింద రూ.24,250 కోట్లు, రెండో దశ కింద రూ.19,750కోట్లు కలిపి మొత్తం రూ.44వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు ఎంఓయూలో కంపెనీ పేర్కొంది. తొలి దశలో 0.5 మిలియన్ టన్నులు, రెండోదశలో 0.5మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయనుంది. తద్వారా మొత్తం 3 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఇప్పటికే ఈ సంస్థ రాష్ట్రంలో రూ.50 వేల కోట్లతో పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టింది. కాగా ఈ సంస్థకు ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామిక ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు 250 ఎకరాల భూకేటాయింపునకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉత్పత్తికి సహకరించడంలో భాగంగా గ్రీన్‌కారిడార్ విధానంలో 2,500మెగావాట్ల విద్యుత్, నీటి అవసరాలు తీర్చేలా 17.2 ఎంఎల్‌డీ నీటి సరఫరా, భారీ పరిశ్రమ కేటగిరీలోకి చేర్చి అన్ని ప్రభుత్వశాఖల నుంచి అవసరమైన అన్నిరకాల అనుమతులు వేగంగా జారీచేయనుంది. ఇదే సంస్థ కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.13వేల కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చింది.

# గోవింద హారతి!





గోదావరి మాతకు హారతిస్తున్న ఆనంద తీర్థాచార్యులు, ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

టీటీడీ ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు శుక్రవారం రాత్రి మహా మంగళ హారతి అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చారు.. ఏడుకొండలవాడు.. భక్తజనం చెంతకు వస్తున్నాడంటే ఊరుకుంటారా.. ఆ స్వామిని చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు.. ఎటుచూసినా భక్తజనమే.. కొవ్వూరు గోదావరి తీరమంతా భక్తజన సంద్రమైంది.. ఆ స్వామిని కన్నులారా చూసి.. మనసారా వేడుకున్నారు.. విశిష్ట పూజలు చేశారు. గోవిందా.. గోవింద నామస్మరణలతో గోష్పాద క్షేత్రం మార్మోగింది.. గోదావరికి గోవిందుడి హారతిచ్చారు. - 8లో



# ఎన్నికలొస్తున్నాయ్!

స్థానికం..సమాయత్తం

స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. గడువుకు ముందే ముందస్తు ఎన్నికల మోత మోగబోతోంది. పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికల రణభేరికి సర్వం సిద్ధమవుతోంది. తాజాగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ఎన్నికల సంఘం కార్యాచరణ రూపొందిస్తోంది. మరో పక్క స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ కేడర్‌ను సైతం టీడీపీ సిద్ధం చేస్తోంది. దీంతో కొద్దిరోజుల్లో స్థానిక సంస్థల వేడి రాజుకోనుంది. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- ముందస్తు సన్నాహాలు
- ఓటర్ల జాబితాకు కసరత్తు
- పార్టీ శ్రేణులకు టీడీపీ పిలుపు
- అధికారులకు ఎస్ఈసీ లేఖలు
- 2026 జనవరిలోగా నోటిఫికేషన్
- అదే నెలలో ఫలితాలు!

అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏడాదిన్నరకు స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఉమ్మడి జిల్లాలో మొదలు కాబోతోంది. వాస్తవానికి వచ్చే ఏడాది మార్చి నాటికి మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు, సర్పంచ్‌లకు ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతోంది. మార్చి తర్వాత ప్రభుత్వం తనకు నచ్చినపుడు ఎన్నికలు జరపొచ్చు. కానీ ప్రభుత్వం మాత్రం ముందస్తుకే మొగ్గు చూపుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏడాదిన్నర లోపే కూటమి సర్కారు అమలు చేసి జోష్ మీద ఉంది.ఈ సమయంలోనే ముందస్తు ఎన్నికలకు వెళ్లి విజయభేరి మోగించా లని భావిస్తోంది. ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేస్తోంది.పార్టీ జాతీ య ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళ వారం అమరావతిలో పార్టీ జోనల్ కో ఆర్డినే టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు.పార్టీ నేతలు,క్యాడర్‌ను సమాయత్తం చేయాలని సూచించారు. ఎన్నికలకు సమాయత్తమయ్యే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే పార్టీ పదవులు చాలావరకు భర్తీ చేశారు. అటు నామినేటెడ్ పదవుల పంపకం పూర్తి చేశారు.

## జనవరిలో ఎన్నికలు..?

స్థానిక సంస్థల గడువు ముగియడానికి మూడు నెలల ముందే వీటికి ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది. మునిసిపాలిటీలు, పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కసరత్తు ప్రారంభించాలని ఆదేశిస్తూ పురపాలక, పంచాయతీరాజ్ శాఖలకు సెప్టెంబరులో లేఖ రాసింది. తాజాగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలకమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు రాష్ట్ర ఛీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ నెల 6న అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణకు వీలుగా సిబ్బందికి శిక్షణ ప్రారంభించబోతున్నారు. ఈ నెలాఖరులోగా ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. డిసెంబరులో వార్డుల వారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, ఎన్నికల అధికారుల నియామకం, పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలను సిద్ధం చేయడం, రిజర్వేషన్లు ఖరారు తదితర ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు సమాచారం.జనవరి నెలాఖరులో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల వెల్లడికి వీలుగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

## 2021లో ఎన్నికలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 1,073 పంచాయతీల్లో నాలుగు దశల్లో 11,782 వార్డులకు 12,048 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు.31 పంచాయతీలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. కాకినాడ,పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 366 పంచాయతీలకు తొలివిడత, రెండోవిడత రాజమహేంద్రవరం,రామచంద్రపురం డివిజన్ల పరిధిలో 247 పంచాయతీలకు, మూడో విడత రంపచోడవరం,ఎటపాక డివిజన్ల పరిధిలో 186 పంచాయతీలకు, నాలుగో విడత కోనసీమలో 274 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో మొత్తం ఓటర్లు 7,68,483గా తేలారు.వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వార్డులు,ఓటర్లు పెరగనున్నాయి.

## పెరగనున్న వార్డులు..

ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయి. కాకినాడ, రాజమ హేంద్రవరంలో రెండు కార్పొరేషన్లు ఉన్నాయి. వీటన్నింటిలో వార్డుల విభజన నేపథ్యంలో వీటి సంఖ్య పెరగనుంది. కాకినాడ కార్పొరేషన్‌కు 2022 సెప్టెంబరుకు ఐదేళ్ల పదవీ కాలం పూర్తయినా మళ్లీ ఇప్పటివరకు ఎన్నికలు జరగ లేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ప్రస్తుతం ఉన్న 50 వార్డులకు అదనంగా మరో పది వార్డుల వరకు పెరిగే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో శివారు గ్రామాల విలీనం సమస్య పరిష్కారమై పెరిగే వార్డులతో కలిపి ఇక్కడా ఎన్నికలు జరగనున్నాయి.

## కొత్త వాళ్లకు చోటు..

2021 మార్చిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏడు మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 268 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు చేరడంతో వీటి సంఖ్య తొమ్మిదికి చేరనుంది.అప్పట్లో చేతిలో అధికారం ఉండడంతో వైసీపీ అడ్డగోలుగా 35 వార్డుల్లో బలవం తపు ఏకగ్రీవాలు చేయించింది.దీంతో 233 వార్డులకే ఎన్నికలు జరిగాయి.వార్డుల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో మునిసిపాలిటీ, నగర పంచాయతీల్లో వార్డుల సంఖ్య మరింత పెరగనుంది. గత మునిసిపల్ ఎన్నికల్లో మొత్తం 655 మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరింత మంది పోటీ చేసే అవకాశం దక్కనుంది.



దేవరపల్లిలో పొగాకు నారుమడులు పరిశీలిస్తున్న పొగాకుబోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

# ఆశాజనకంగా పొగాకు ధరలు

**దేవరపల్లి పొగాకు బోర్డు సందర్శనలో చైర్మన్ యశ్వంత్‌కుమార్**

దేవరపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్.యశ్వంత్ కుమార్ అన్నారు. దేవరపల్లిలో శుక్రవారం పొగాకు బోర్డును సందర్శించి మాట్లాడారు. గత రెండేళ్లగా పోల్చితే ఈ ఏడాది చివరిలో సంతృప్తికరంగా లేదన్నారు. గ్రేడ్ వన్ పొగాకు ధర ఆశాజనకంగా ఉన్నా మాడుకు ధర అంత ఆశాజనకంగా లేదన్నారు. పొగాకు పరిమితి మేరకే పండించాలని రైతులకు సూచించారు. ఎన్ఎల్ఎస్ ఏరియాలో 83.62 మిలియన్ కిలోలు పొగాకు ఉత్పత్తి అయ్యిందన్నారు. జం గారెడ్డి గూడెం, కొయ్యలగూడెం కేంద్రాల్లో ఈ నెలాఖరు వరకు పొగాకు కొనుగోళ్లు జరుగుతాయన్నారు.ఈ ఏడాది ఏపీలో 16 వేల కేంద్రాల్లో 167 మిలియన్ కిలోలు పొగాకు ఉత్పత్తి అంచనా వేయగా 240 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయ్యిందని తెలిపారు.కర్ణాటకలో ఇప్పటి వరకు 14 మిలియన్ కిలోల పొగాకు అమ్మకం జరిగిందన్నారు.అనంతరం దేవరపల్లి, పల్లంట్ల సంగాయిగూడెంలోని పొగాకు నారుమడులు పరిశీలించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్, దేవరపల్లి పొగాకు బోర్డు ఏఎస్ హేమస్మిత, రైతులు కరుటూరి శ్రీనివాస్, కాట్రు సత్యనారాయణ, నరహరిశెట్టి రాజేంద్ర బాబు, దుద్దుపూడి హరిబాబు పాల్గొన్నారు.

# జిల్లాలో సదరం శిబిరాలు ప్రారంభం

- ఈ నెల 14 నుంచి స్లాట్‌లు
- డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ



కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా కొత్త సదరం సర్టిఫికెట్లు జారీ కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించేందుకు నవంబరు 14వ తేదీ నుంచి స్లాట్ విడుదల చేసినట్టు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారిని (డీసీహెచ్ఎస్) డా. ఎం.పద్మ తెలిపారు. ప్రతి సోమవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, ప్రతి మంగళవారం ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, జీజీహెచ్‌లలో సదరం సర్టిఫికెట్లకు అవసరమైన అసెస్‌మెంట్లు, స్ర్కీనింగ్‌లు నిర్వహించబడతాయన్నారు.డీఎస్‌హెచ్ అండ్ డీఎంఈ ఆసుపత్రుల్లో రెగ్యులర్ స్లాట్‌ల కేటాయింపు జరుగుతుందన్నారు.సదరం శిబిరాల్లో రోస్టర్ ప్రకారం సాంకేతిక సిబ్బంది విధులు నిర్వహించడం జరుగతుందన్నారు. దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీసీహెచ్ఎస్ డా.పద్మ తెలిపారు.



బస్‌ను ప్రారంభిస్తున్న వైఎస్ఎన్ మూర్తి

# శబరిమలకు ఆర్టీసీ బస్‌లు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి శబరిమల అయ్యప్పభక్తుల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం తొర్రేడు నుంచి శబరిమల యాత్రకు బయలుదేరిన బస్సును ప్రారంభించి మాట్లాడారు. అయ్యప్పభక్తుల కోసం శబరిమలకు ప్రత్యేకంగా ఆడియో, వీడియో, పుష్‌బ్యాక్ సౌకర్యం కల్గిన కొత్త బస్సులు నడుపుతున్నామన్నారు. ఇప్పటికే 8 బస్సులకు టిక్కెట్లు బుక్ అయ్యాయన్నారు. రూటు అవగాహన కల్గిన ఇద్దరు డ్రైవర్లు ఉంటారని, 36 సీటింగ్ సామర్థ్యం ఉంటుందని తెలిపారు. బస్సు మొత్తం బుక్ చేసుకుంటే ఇద్దరు గురుస్వాములకు, ఇద్దరు వంటవారికి, ఇద్దరు మణికంఠలకు ఉచితంగా అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 15వ తేదీన దొడ్డిగుంట నుంచి ఒకటి, 17న జంబూపట్నం నుంచి మూడు, పిడింగొయ్యి నుంచి ఒక బస్సు బయలుదేరి వెళుతున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్ మాట్లాడుతూ 30 కంటే ఎక్కువ మంది మంది భక్తులు ఉంటే వారు కోరినచోటు నుంచే బస్సు నడుపుతామన్నారు.కార్యక్రమంలో ఎం.అజయ్‌బాబు, బి.శివకుమార్ పాల్గొన్నారు.





## నిడదవోలు పురపాలనకు..

# వజ్రోత్సవం

- 1964లో మునిసిపాలిటీగా మార్పు
- 60 ఏళ్లుగా సేవలు
- రేపటి నుంచి ఉత్సవాలు
- 5కే రన్, వాక్‌తో ఆరంభం

**అభివృద్ధి చేస్తా..**



నిడదవోలును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం. డైమండ్ జూబ్లీ ఉత్సవాల స్ఫూర్తితో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం.
- దుర్గేష్, మంత్రి

**చైర్మన్..అదృష్టం**



నిడదవోలు పురపాలక సంఘ చైర్మన్ కావడం నా పూర్వజన్మ సుకృతం. నా హయాంలో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది.
- ఆదినారాయణ, చైర్మన్

నిడదవోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే ఎంతో చారిత్రాత్మకమైన పురపాలక సంఘంగా నిడదవోలు.. 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని నిడదవోలు పురపాలక సంఘం వజ్రోత్సవం 2025 పేరుతో వేడులకు సిద్ధమవుతుంది. నిడదవోలు నగర పంచాయితీ నుంచి 1964 డిసెంబరు 1వ తేదీన ప్రత్యేక అధికారి పాలనతో నిడదవోలు పురపాలక సంఘ పాలన ప్రారంభమైంది. గత 60 ఏళ్లుగా అభివృద్ధి చెందుతున్న ఈ పురపాలక సంఘానికి 8 మంది ప్రత్యేకాధికారులు, 12 మంది చైర్మన్లు ప్రాతినిధ్యం వహించారు. తొలి చైర్మన్‌గా డాక్టర్ బీవీఎల్ఎన్.రాజు (భూపతిరాజు వెంకట లక్ష్మీ నరసింహరాజు) 1967 అక్టోబరు 20వ తేదీ నుంచి 1970 ఫిబ్రవరి 8వ తేదీ వరకు బాధ్యతలు నిర్వహించగా ప్రస్తుతం 12వ చైర్మన్‌గా 2021 మార్చి 18వ తేదీ నుంచి భూపతి ఆదినారాయణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నిడదవోలులో ఈ నెల 16వ తేది ఆదివారం ఉదయం 6 గంటలకు 5కె రన్,వాక్ తో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ నెలాఖరు వరకు నిడదవోలులో పెద్ద ఎత్తున డైమండ్ జూబ్లీ ఉత్సవాలకు నిడదవోలు పురపాలక సంఘం సంసిద్ధం అవుతోంది. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

**జేసీ మేఘాస్వరూప్**

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి జిల్లాలో వరి సేకరణ 4 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించినట్టు జేసీ వై . మేఘా స్వరూప్ శుక్రవారం తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో శుక్రవారం వరకు(14వ తేదీ నాటికి) 5,890 ధాన్యం కూపన్లు జనరేట్ చేయగా 16 మండలాల్లో ఏర్పాటు చేసిన 122 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3,695 మంది రైతుల నుంచి 27,616.360 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. 48 గంటల్లోపు 3,191 మంది రైతుల ఖాతాకు రూ.56.84 కోట్లు జమ చేశామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం తేమ స్థాయికి ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. గోనెసంచులు ఆర్ఎస్‌కెల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీకి రూ.2,389, గ్రేడ్ ఏ వెరైటీకి రూ.2.369 చొప్పున చెల్లింపులు జరుగుతాయన్నారు. గోనెసంచులు వినియోగానికి ఒక్కింటికి రూ.4.74, హమాలీకి ప్రతి క్వింటాకు రూ.22 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు, సందేహాల నివృత్తికి కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



8

## ఆపరేషన్..గోదారి!

### 17న చలో ఢిల్లీ కార్యక్రమానికి హాజరుకావాలి

ఉండ్రాజవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఈనెల 17న ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని నిడదవోలు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ కోకన్వీనర్, మండల ప్రధాన కార్యదర్శి మండవల్లి అనిల్‌కుమార్ శుక్రవారం పత్రికా ప్రకటనలో కోరారు. ఈమేరకు వారు విలేఖరులతో మాట్లాడారు.

## అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేయాలి



సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రీస్కూల్ పిల్లలతో అంగన్వాడీ సెంటర్ల బలోపేతానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు సీహెచ్ మాణిక్యమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక సచివాలయాల్లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే 3 నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లలో ఉండే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు.

### ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

నిడదవోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని నిడదవోలు నూతన ఎంపీడీవో టీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సమిశగూడెంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

### సొసైటీ ద్వారా విద్యార్థులకు నగదు బహుమతులు

దేవరపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి సొసైటీ ద్వారా ప్రథమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు పేర్కొన్నారు. దేవరపల్లి సహకారం సంఘం 72వ వారోత్సవాల సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జెండాను ఆవిష్కరించారు. దేవరపల్లి సొసైటీ పరిధిలో ఉన్న ధూమంతనగూడెం, రామన్నపాలెం, అచ్చెయ్యపాలెం, బుచ్చయ్యపాలెం, దేవరపల్లి, 10వ తరగతిలో ప్రథమర్యాంకు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి 1500 చొప్పున్న నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కల్లూరి శ్రీనివాస్ శర్మ, సొసైటీ సభ్యులు కవల సీతారత్న సూర్యకుమారి, తంగెళ్ల శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

### పరీక్షా కేంద్రాల పరిశీలన

దేవరపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షలు జరిగే సెంటర్లలో అన్ని సౌకర్యాలు ఉండాలని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.అమలకుమారి అన్నారు. దేవరపల్లిలో శుక్రవారం 10వ తరగతి పరీక్షలు జరిగే సెంటర్లను మండల విద్యాశాఖాధికారులతో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అనుకూలంగా ఉన్న పాఠశాలలనే ఎంపిక చేయాలన్నారు. నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు తిరుమలదాసు, అప్పారావు, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**గోపాలపురం:** విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలోని పదోతరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించే కేంద్రాలను శుక్రవారం విద్యాశాఖాధికారులు పరిశీలించారు. ఎంఈఓ జీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రం, వేలచింతలగూడెం సెంట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, రాజంపాలెం జిల్లా పరిషత్ పాఠశాల రాజంపాలెం సెంట్‌మేరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ తరగతి గదులను పరిశీలించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ఫ్యాన్లు, లైట్లు, తాగునీటితో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణలో సంతృప్తి వ్యక్తం చేశామన్నారు. ఏసీఈ అమలకుమారి, సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, హనుమంతు, తదితరులు ఉన్నారు.

### లారీ బోల్తా... గాయాలు

గోపాలపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీ బోల్తాపడిన సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం పంచదార లోడుతో వెళ్తున్న లారీ మార్గ మధ్యలో గోపాలపురం 516డీ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బ్రేక్ వేయడంతో పంచదారతో వెళ్తున్న లారీ బోల్తా పడిందన్నారు. గాయపడిన డ్రైవర్, క్లీనర్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

### నల్లజర్ల తహశీల్దార్‌గా కృష్ణారావు

నల్లజర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల తహశీల్దార్‌గా కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహశీల్దార్‌గా పనిచేసిన ఎస్‌వీఎస్ నాయుడు కొవ్వూరు డీటీగా వెళ్లారు. కృష్ణారావు సంవత్సరం క్రితం నల్లజర్ల తహశీల్దార్‌గా పని చేసి బదిలీపై మంగళగిరి సీఆర్‌డీకి వెళ్లారు. అక్కడ నుంచి నల్లజర్ల తహశీల్దార్‌గా తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

## గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలు

• మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి



కొవ్వూరులో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి



నిడదవోలులో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ జాతిపిత మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ, సరస్వతీదేవి చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ తోట లక్ష్మీప్రసన్న, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, గ్రంథాలయాధికారి కె.సుగుణకుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 2వ వార్డు మండల పరిషత్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

**నిడదవోలు:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగపర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నందిన సుబ్బారావు లీలావతి శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రాంభించారు. ఈ సందర్భంగా దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు గ్రంథాలయ వార్సోవాల ప్రతిజ్ఞ చేయించారు.

**చాగల్లు:** పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయించాలని, గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మార్కొండపాడు సొసైటీ అధ్యక్షుడు మద్దిపాటి వీరరాఘవులు అన్నారు. శుక్రవారం చంద్రవరంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిపాటి శ్రీరామ్మూర్తి, గ్రంథపాలకుడు కే. సుమన్‌కుమార్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రమేష్, హెచ్ఎం జీ. రామచంద్రమూర్తి, తదితరులు పాల్గొని విజ్ఞాన, వినోదం కోసం ప్రజలు గ్రంథాలయాలకు తప్పక వెళ్లి దినపత్రికలు, పుస్తకాలు చదువుకోవాలన్నారు. అలాగే బాలల దినోత్సవ వేడుకలను చాగల్లు శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో సందడిగా నిర్వహించారు. చిన్నారులు దేశ నాయకులు, రైతులు, జవాన్, స్వాతంత్ర్య పోరాట యోధులు సహా పలువురి వేషాలతో ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ వల్లిపల్లి వేంకట రామారావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు రావాలని ఆశీస్సులు అందించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహించారు.

**పెరవలి:** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా తీపర్రు, ముక్కామల, పెరవలి గ్రంథాలయాల్లో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రశంగించారు. ప్రతి గ్రామంలోనూ గ్రంథాలయం, దేవాలయం, విద్యాలయాలు ఉండాలని గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా పలువురు ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కడియాల సాయి రామారావు, గ్రంధి శ్రీరామచంద్రరావు, ఎంఈవో సూర్‌జాన్, నల్ల సీతారామస్వామి, నల్ల సురేంద్ర, డీ. సత్యనారాయణ, కంటిపూడి సూర్యనారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, గంగోలు సీతమ్మ, ఎంఈవో సుబ్రహ్మణ్య స్వరూప్, తెలుగు పండితులు సుభాష్ చంద్రబోస్, పిప్పర రవి, మానికిరెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు. అలాగే పెరవలి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మల్లేశ్వరంలో యాతం రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్‌లో లయన్స్ ప్రముఖులు పాపారావు సహకారంతో నోటు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో సలాది భాస్కరరావు, యాతం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** దేవరపల్లి శాఖా గ్రంథాలయం వద్ద శుక్రవారం 58వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్పంచ్ కడిమి వీరకుమారి జెండాను ఆవిష్కరించారు. జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉండవల్లి కృష్ణారావు, మాధవరపు వెంకటేశ్వరరావు, దుగ్గిన గంగాధరరావు, గ్రంథాలయాధికారి వీ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**నల్లజర్ల:** గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలుగా నిలుస్తాయని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నల్లజర్ల శాఖ గ్రంథాలయ చైర్మన్ గుదే సుశీల అన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను ఉపయోగించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయని పేర్కొన్నారు. విజ్ఞానం కావాలంటే పుస్తక పఠనం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో పులి బాలాజీ, గుదే సుబ్బారావు, గుదే శ్రీను, శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**తాళ్లపూడి:** తాళ్లపూడి శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తహశీల్దార్ సరస్వతీమాత విగ్రహానికి పూలమాలవేసి రిబ్బన్ కట్ చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ విశిష్టతపై ప్రసంగించారు. రిటైర్డ్ ఎంఈవో సీహెచ్ ఆంజనేయులు, రీడర్స్ ఫోరమ్ అధ్యక్షుడు గుండుబోగుల ఆదినారాయణ, గ్రంథాలయ అధికారి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఆహార నియమాలు పాటించాలి

• పీహెచ్‌సీ డాక్టర్ ఉమామహేశ్వరరావు

ఉండ్రాజవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): షుగర్ వ్యాధి నివారణకు ఆహార నియమాలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ బీ. ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఉండ్రాజవరం పీహెచ్‌సీలో జరిగిన వరల్డ్ డయాబెటిస్ డే అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవుని శరీరంలో అధిక చక్కెర స్థాయిలు ఉండటం వల్ల డయాబెటిస్ వ్యాధి వస్తుందని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కె. కుమారి, హైస్కూలు హెచ్ఎం కె. రామకృష్ణ, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే మద్దిపాటి పుట్టినరోజు వేడుకలు



కేకు కట్ చేస్తున్న అభిమానులు

దేవరపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లగూడెంలో గల దివ్యాంగుల వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు, అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కట్ చేసి దివ్యాంగులకు పంచిపెట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

### తరలి వెళ్లిన ఎమ్మెల్యే అభిమానులు

నల్లజర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ద్వారకా తిరుమలలో జరిగాయి. దీంతో మండలం నుంచి వేలాది మంది అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరలివెళ్లారు. ఉదయం ఏడు గంటల నుంచే అభిమానులు ర్యాలీగా వెళ్లారు. వెళ్లినవారిలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, యలమాటి శ్రీనివాసరావు, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఏలేటి సత్యనారాయణ (జేడీ) బేతిన అనిల్, అల్లూరి రాజేష్, అప్పసాని రాంబాబు, రావూరి వెంకట రమణ, చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, మండల అధికారులు, తదితరులు ఉన్నారు.

### ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 12 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు గాను ప్రతివారం గ్రీవెన్స్ నిర్వహించి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి 12 ఫిర్యాదులు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచన మేరకు ప్రజాప్రతినిధులు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, సూరపనేని చిన్ని, మేకల శ్రీను, వేమగిరి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

### పెరటి కూరగాయలతో ఆరోగ్యం

• వెంకటరామన్నగూడెం వైయస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు



తిమ్మన్నపాలెంలో పర్యటిస్తున్న విద్యార్థులు

నల్లజర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు ఉన్న ఖాళీ స్థలాలు, పెరటిలో కూరగాయలు పండించుకుని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండొచ్చని వెంకటరామన్నగూడెం వైయస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు శనివారం అవగాహన కలించారు. శుక్రవారం తిమ్మన్నపాలెం, కవులూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూరగాయల విత్తనాలు (టమాట, మిర్చి, వంగ) అందించారు. బయట మార్కెట్‌లో దొరికే కూరగాయల ఎంతో విషపూరితంగా ఉంటున్నాయని, మనం తినేవి మన ఇళ్ల వద్దే పండించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎన్ ఇన్‌చార్జి డాక్టర్ సీపీ విజ్జీ, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు ఆర్థికసాయం



బాధిత చిన్నారితో మాట్లాడుతున్న టీచర్లు

తాళ్లపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మోటారుసైకిల్ ప్రమాదంలో గాయపడి కాళ్లు విరిగిన వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డిడి రావు వాట్సాయాప్ మేసేజ్ ద్వారా స్నేహితులు, ఉపాధ్యాయుల నుంచి రూ. 37వేలు సేకరించారు. ఇందులో గాయపడిన బోడపాటి ధరణికి రూ. 10 వేలు హస్పటల్ నందు, గండి శ్రీలక్ష్మికి రూ.14 వేలు, మెల్లిమి పోసమ్మకు రూ. 12 వేలు బల్లిపాడులో ఇంటి వద్ద అందజేశారు. డీడీ రావు మాట్లాడుతూ ప్రమాదం బారిన పడిన వారికి సాయం చేద్దామని, కేవలం వాట్సాయాప్ ద్వారా తెలియజేసిన వెంటనే స్పందించిన ఉపాధ్యాయులు, స్నేహితులకు ధన్యవాదాలు తెలిపారు. బాధిత విద్యార్థులకు ఉచిత వైద్య సాయం అందించిన ఆసుపత్రి నిర్వాహకులు సుధీర్, గూడా రాజుకు అభినందనలు తెలియజేశారు.

## 'విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ నాగలక్ష్మి

కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని, దాన్ని సాధించడానికి కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను అందుకోవడం అసాధ్యం కాదని క్లాస్- 2 మేజిస్ట్రేట్ కే.నాగలక్ష్మి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కొవ్వూరు గవర్నమెంట్ హైస్కూల్లో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకి పిల్లలంటే ఇష్టమని, అందువల్ల ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.హరీష్, పీవీవీ లక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**గోపాలపురం:** మాజీ ప్రధాని జవహర్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** దేవరపల్లి భాష్యం స్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్కూల్ జోనల్ ఇన్‌చార్జి ఆంజనేయులు మాట్లాడుతూ దేశ తొలి ప్రధాని నెహ్రూ చెప్పిన విధంగా నేటి బాలలే రేపటి పౌరులని, వారి చేతిలోనే దేశ భవిష్యత్ నిర్మితమవుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు, ఛాంప్స్ ప్రిన్సిపాల్ సబాన, టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** మండలంలో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఆయా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కొన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు ప్రత్యేక వంటకాలను వడ్డించారు. మోర్త నెం.1 పాఠశాలలో కేక్ కట్ చేశారు. పండిట్ జవహర్ లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమాల్లో ఎంఈవో సక్సేనరాజు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి హారతికి పటిష్ట బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

కొవ్వూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదావరి హారతికి పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్టు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. శుక్రవారం గోష్పాదక్షేత్రంలో జరుగుతున్న గోదావరి హారతి ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. హారతి జరుగుతున్న ప్రాంతాలు, ప్రసాదం పంపిణీ, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు అందజేశారు. గోదావరి నదిలో ఎవరూ దిగకుండా పడవలపై గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయడంతో పాటు బారి కేడింగ్ ఉండాలన్నారు. హారతి తిలకించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసాదం పంపిణీ వద్ద తొక్కిసలాట జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.దేవకుమార్, ఆర్డీవో రాణీసుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సిఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, ఎస్ఐలు కె.శ్రీహరిరావు, తోట రామకృష్ణ, నరేంద్ర,ఎలక్ట్రికల్ ఏఈలు డి.జగదీశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, ఏజీఆర్‌బి ఏఈ జీ. మణికంటరాజు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

### ఎలక్ట్రికల్ ఏఈకి అభినందనలు

ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఏఈ డి. జగదీశ్వరరావును ఎస్పీ అభినందించారు. జగదీశ్వరరావు కుమారుడు డి.వినయ్ ఇటీవల సివిల్స్‌లో 274వ ర్యాంకు సాధించాడని డీఎస్పీ దేవకుమార్ ఎస్పీ నరసింహ కిషోర్‌కి తెలియజేశారు.

## పిల్లలకు సనాతన ధర్మం నేర్పించాలి

• దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి ఆనంద తీర్థాచార్యులు

• టీటీడీ ఆధ్వర్యంలో గోదావరికి మహా నీరాజనం





మాట్లాడుతున్న ఆనందతీర్థాచార్యులు, హాజరైన కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత, అధికారులు

కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు సనాతన సంప్రదాయాలను నేర్పించాలని తితిదే దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు అన్నారు. టీటీడీ ధర్మప్రచారంలో భాగంగా కార్తీకమాసం శుక్రవారం సాయంత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు మహా మంగళహారతిని అందజేశారు. ముందుగా టీటీడీ నుంచి తీసుకువచ్చిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి, విశ్వక్సేన, కలశ, షోడశ, గోదావరి పూజ నిర్వహించారు. తర్వాత గోదారమ్మకు వాయినం అందజేశారు. అనంత రం ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో గోదారమ్మకు వివిధరకాల హారతులు సమర్పించారు. వేలాదిగా భక్తులు, మహిళలు తరలివచ్చారు. దీంతో గోష్పాదక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా జాయింటు కలెక్టర్ మేఘాస్వరూప్, అడిషనల్ ఎస్పీ ఎన్.మురళీకృష్ణ, ఆర్డీవో రాణి సుస్మిత, మున్సిపల్ చైర్మన్ బావన రత్నకుమారి, మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు సూరపనేని చిన్ని, బీజేపీ రాష్ట్ర నాయకుడు పరిమి రాధాకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వరరావు, సూర్యదేవర రంజిత్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, పట్టణ సీఐ పి. విశ్వంల్ సీఐ కె.విజయ్‌బాబు, పిల్లలమర్రి మురళీకృష్ణ, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంట రాజు, మున్సిపల్, విద్యుత్‌శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు వెంకటేశ్వరస్వామి వారి ప్రసాదాన్ని పంపిణీ చేసి వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆనంద తీర్థాచార్యులు గోష్పాదక్షేత్రంలో గత 17 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకమన్నారు. తర్వాత పలు సూచనలు చేశారు. అనంతరం అల్లూరి ఇంద్ర కుమార్, జాయింట్ కలెక్టర్ మేఘాస్వరూప్, అడిషనల్ ఎస్పీ ఎన్.మురళీకృష్ణ మాట్లాడారు. గోదావరి హారతి కార్యక్రమం దిగ్విజయం కావడానికి సహకరించిన అధికారులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ గోదారి

• విజ్జేశ్వరం స్కవర్ స్లూయిజ్ నుంచి మురుగునీరు విడుదల



స్విచ్ఛాన్ చేస్తున్న ఈఈ శ్రీనివాసరావు

నిడదవోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి వరదలు వచ్చే వేళ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిలో కొట్టుకు వచ్చే మట్టి, చెత్తాచెదారాలు గోదావరి నది బ్యారేజీలో ఒక ప్రత్యేక బ్లాక్‌లోకి వెళ్లే విధంగా ఆనాడు కాటన్ మహాశయుడు గోదావరి నదిపై బ్యారేజ్ నిర్మించాడు.ప్రతి ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు దిగువకు కొట్టుకు వచ్చే మట్టి, చెత్త విజ్జేశ్వరం బ్యారేజీ వద్ద బ్లాక్‌కు చేరుతుంది. దీనిని నీటిపారుదల శాఖాధికార్లు ఏడాదికి ఒకసారి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ పేరుతో 4గేట్లను పైకెత్తి దిగువకు విడుదల చేస్తారు. శుక్రవారం నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద హెడ్ వర్క్స్ ఈఈ జీ.శ్రీనివాసరావు స్విచ్ఛాన్ చేసి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ఆపరేషన్ ద్వారా 4 గేట్లు పైకెత్తి సు మారు 11.401 క్యూ సెక్కుల నీటిని దిగు వకు విడుదల చేశారు. కార్యక్రమంలో కె.ఆనంద్‌బాబు, డి.రాధాకృష్ణ, ఆర్.సు నీల్‌బాబు, జీ.జయవిక్రమ్, జి.రాజేష్, ఏ.మీరాబాబు పాల్గొన్నారు.